
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 27.5
కనిష్ఠం 16.4

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 16 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.80 (304.4680)	14,274	14,274
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.15 (4.36)	1,642.81	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.260

హ్యామ్ రోడ్లు ఖిరాయి



- రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలోనే అత్యధికం
- 11,399.33కోట్లలో 21శాతం నిధులు ఉమ్మడి జిల్లాకే
- ఆర్‌అండ్‌బీ ప్రాజెక్టుల్లో అగ్రతాంబూలం
- 1,026కి.మీ రూ.2346.96కోట్ల ప్రతిపాదనలు

కీలకమైన గ్రామీణ రోడ్ల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెస్తున్న హ్యామ్ (హైబ్రిడ్ యాన్యువల్ మోడల్) విధానంలో ఉమ్మడి జిల్లా రోడ్లకు అగ్రతాంబూలం దక్కింది. ఈ రోడ్ల పునరుద్ధరణ, విస్తరణ ప్రాజెక్టును ఆర్‌అండ్‌బీశాఖ చేపట్టడం, ఉమ్మడి జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ శాఖకు మంత్రి కావడంతో ఈ ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో ఉమ్మడి జిల్లా రోడ్లకే సుమారు 21శాతం నిధులు దక్కాయి.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

శాశ్వత ప్రాతిపదికన రోడ్లను నిర్మించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టులో రోడ్ల నిర్మాణమేగాక జాతీయరహదారుల తరహాలో నిర్మాణంతో పాటు 15 ఏళ్లపాటు నిర్వహణ సైతం చూసేలా జాతీయవిధానానికి మార్పులు, చేర్పులు చేస్తూ హ్యామ్ (హైబ్రిడ్ యాన్యువల్ మోడల్)ను అమల్లోకి తెస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్లను బలోపేతం చేయడం, అవసరమైన చోట్ల డబుల్‌లేన్లు, ఫోర్‌లేన్లుగా మార్చడం, బ్రిడ్జిల నిర్మాణాలు సైతం చేపట్టడం వంటి పనులకు ఈ ప్రాజెక్టులో చోటుదక్కింది. ఆర్‌అండ్‌బీశాఖ పనుల ఖరారుతోపాటు, ప్యాకేజీలను నిర్ణయించి టెండర్లకు వెళ్లేందుకు ప్రణాళికను క్యాబినెట్ ఆమోదంతో ఇప్పటికే సిద్ధం చేసింది. ఈ ప్యాకేజీలకు త్వరలో టెండర్లను ఆహ్వానించనుండడంతో మరో మూడేళ్ల కాలవ్యవధిలో జిల్లాలో ఈ పథకం కింద చేపట్టిన రోడ్లన్నీ అందుబాటులోకి రానున్నాయి. 15 ఏళ్లపాటు నిర్వహణ సైతం నిర్మాణ సంస్థలే భరించనుండడంతో గుంతల బెడద, మరమ్మతుల ఇబ్బందులు దీర్ఘకాలంపాటు తప్పుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఉమ్మడి జిల్లాకే 21శాతం నిధులు

హ్యామ్ ప్రాజెక్టులో ఆర్‌అండ్‌బీశాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.11,399.33కోట్ల అంచనావ్యయాన్ని ప్రాథమికంగా నిర్ధారించగా, అందులో ఉమ్మడి జిల్లాలో చేపట్టే పనులకు రూ.2,346.96కోట్ల నిధులు కేటాయించనున్నారు. సుమారు 21శాతం నిధులు జిల్లా రోడ్ల నిర్మాణాలకు దక్కనున్నాయి. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 32 ప్యాకేజీలను ఖరారు చేస్తే అందులో ఉమ్మడి జిల్లా పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం కింద 5,824కి.మీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనుండగా, అందులో 18శాతం అంటే 1,026 కి.మీ నల్లగొండ జిల్లా రోడ్లకు వాటా దక్కింది. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 419 రోడ్లను ఈ ప్రాజెక్టులో చేర్చితే అందులో 60 రోడ్లు ఉమ్మడి జిల్లాకు దక్కాయి.

ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో కీలక పనులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన...

- మిగతా 8వ పేజీలో...

నల్లగొండ జిల్లాలో హ్యామ్ రోడ్లు ఇవే..

డిండి-దేవరకొండ	34కి.మీ	రూ.108.87కోట్లు
కొండమల్లేపల్లి-దర్వేశిపురం (మూడు పనులు)	43 కి.మీ	రూ.133.40కోట్లు
డిండి-దేవరకొండ-కంబాలపల్లి	31కి.మీ	రూ. 84.87కోట్లు
ముకుందాపురం-అడవిదేవులపల్లి (రెండుపనులు)	30కి.మీ	రూ.80.50కోట్లు
మిర్యాలగూడ-తడకమళ్ల	15.43కి.మీ	రూ.50.12 కోట్లు
కుక్కడం-పాములపహాడ్	20కి.మీ	రూ.17.56కోట్లు
బొత్తలపాలెం-రాగడప	25.65కి.మీ	రూ.22.52కోట్లు
గూడాపూర్-చౌటుప్పల్	42.80కి.మీ	రూ.133.12కోట్లు
ఇడికూడ-నారాయణపూరం	19.20కి.మీ	రూ.52.74కోట్లు
అల్వాలఅడ్డరోడ్డు-రాజవరం	14.22కి.మీ	రూ.39.06కోట్లు
నకిరేకల్-మూసీరోడ్డు	12.00కి.మీ	రూ.11.52కోట్లు
మెడికల్‌కాలేజీ-ఏ.దుప్పలపల్లి	10కి.మీ	రూ.210.03కోట్లు
నకిరేకల్-గురజాల	17.60కి.మీ	రూ.19.54కోట్లు
కురుమూర్తి-శాలిగౌరారం	10.20కి.మీ	రూ.8.95కోట్లు
నల్లగొండ-చౌటుప్పల్	15కి.మీ	రూ.48.03కోట్లు
సూర్యాపేట జిల్లాలో...		
దురాజ్‌పల్లి-గరిడేపల్లి	27.20కి.మీ	రూ.31.50కోట్లు
సూర్యాపేట-నెమ్మికల్-దంతాలపల్లి	36.40కి.మీ	రూ.42.15కోట్లు
మామిడాల-కుంటపల్లి	18.40కి.మీ	రూ.16.15కోట్లు
రాయినిగూడెం-బరాఖత్‌గూడెం	11.20కి.మీ	రూ.12.97కోట్లు
కోదాడ-రేపూరు రోడ్డు	20.05కి.మీ	రూ.24.07కోట్లు
శాంతినగర్-గొండ్రియాల	11.60కి.మీ	రూ.10.18కోట్లు
హుజూర్‌నగర్-మేళ్లచెరువు	11.10కి.మీ	రూ.12.85కోట్లు
హుజూర్‌నగర్-యాతవాకిళ్ల	4.00కి.మీ	రూ.4.63కోట్లు
హుజూర్‌నగర్ లింకురోడ్-రింగ్‌రోడ్డు	6.15కి.మీ	రూ.7.13కోట్లు
బరాఖత్‌గూడెం-కాగితరాంచంద్రాపురం	7.00కి.మీ	రూ.8.11కోట్లు
యాదాద్రి జిల్లాలో...		
నాగిరెడ్డిపల్లి-టేకులసోమారం-వలిగొండ-తుమ్మలగూడెం-బోగారం-రామన్నపేట- చిట్యాల	14.20కి.మీ	రూ.85.11కోట్లు
భువనగిరి-చిట్యాల రోడ్డు	25.80కి.మీ	రూ.154.64కోట్లు
తుర్కపల్లి-రంగాపూర్	17.80కి.మీ	రూ.20.61కోట్లు
ఆలేరురోడ్డు-జగదేవ్‌పూర్ రోడ్డు	28.20కి.మీ	రూ.60.78కోట్లు
ఆలేరు-జీడికల్	12.50కి.మీ	రూ.16.86కోట్లు
జీడికల్-అమ్మనబోలు	26.00కి.మీ	రూ.34.88కోట్లు
రాయిగిరి-మోత్కూరు రోడ్డు నుంచి చిట్యాల-భువనగిరి రోడ్డు వరకు	15.50కి.మీ	రూ.13.61కోట్లు
చౌటుప్పల్-నాగారం	18.50కి.మీ	రూ.21.43కోట్లు



అంగన్‌వాడీల సేవలు అంతంత మాత్రమే

- ఉమ్మడి జిల్లాలో పలు టీచర్, ఆయా పోస్టులు ఖాళీ
- టీచర్ ఉంటే ఆయా లేరు.. ఆయా ఉంటే టీచర్ లేరు
- ఒక్కొక్కరికీ రెండు, మూడు కేంద్రాల నిర్వహణ బాధ్యత

మోత్కూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో పాటు, ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుచేశాయి. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ వయసు పరిమితి 65 ఏళ్లు. టీచర్లు, ఆయాలు ఉద్యోగ విరమణ పొందుతుండగా, వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో చాలా కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.కొన్ని చోట్ల ఒక్కొక్కరికి రెండు, మూడు కేంద్రాల బాధ్యత అప్పగించారు. వారు ఒక కేంద్రంలో ఉంటే మరో కేంద్రం మూసివేయాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వాల లక్ష్యం నీరుగారుతుండగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు.

ఉమ్మడి జిల్లాలో 4,203 అంగన్‌వాడీ కేంద్రాలు

యాదాద్రి జిల్లాలో 901 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటి పరిధిలో 36,084 మంది చిన్నారులు, 5,024 మంది గర్భిణులు, 4,392 మంది బాలింతలు నమోదై ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 2,093 అంగన్‌వాడీ కేంద్రాలు...

- మిగతా 7వ పేజీలో...



గుమ్మడితో లాభాలెన్నో..!

7

లోక్‌అదాలత్ 12 బెంచీల ఏర్పాటు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సంపూర్ణ ఆనంద్



పెండ్లిపాకల రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

నల్లగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల సౌకర్యం కోసం లోక్‌అదాలత్ 12 బెంచీలు ఏర్పాటు చేశామని జిల్లా ఇన్‌చార్జి న్యాయాధికారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సంపూర్ణ ఆనంద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని లోక్‌అదాలత్‌లలో 31 సివిల్ కేసులు, 2,813 క్రిమినల్ కేసులు, 45 మోటార్ ప్రమాద బీమా కేసులు, 6 చెక్‌బౌన్స్ కేసులను, 26 సైబర్ క్రైం కేసులు మొత్తంగా 2,921 కేసులను పరిష్కరించామన్నారు. ప్రమాద బీమా కేసుల్లో రూ.2,95,35,000 పరిహారంగా ఇప్పించామని, సైబర్ క్రైం కేసుల్లో రికవరీ డబ్బు రూ.2,17,915ను ఇప్పించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తంరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అనంతరెడ్డి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిపాకల పనుల పనురుద్ధరణకు చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(చెరువు) కింద దెబ్బతిన్న పనులన్నింటినీ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఆమె పరిశీలించారు. 1వ పీయర్ నుంచి 5వ వరకు వర్షాలకు తెగిన కాల్వలు, దెబ్బతిన్న రహదారి, కట్ట పరిస్థితిని పరిశీలించారు. భారీ వర్షాలతో రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండి ప్రమాద స్థాయికి చేరుకోగా, రిజర్వాయర్ వెంట ఉన్న రెండు తండాలు హీర్యతండా, సింగ్యాతండా, ప్రజలను ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించామన్నారు. రిజర్వాయర్ పరిధిలో దెబ్బతిన్న పనుల పునరుద్ధరణకు ఎఫ్‌డీఆర్ కింద ప్రతిపాదనలు పంపామన్నారు. హీర్యతండా, సింగ్యతండా, గుడితండా, కారోబార్‌తండాలు, రిజర్వాయర్ స్థిరీకరణ, సామర్థ్యం, ఎత్తు పెంచితే మునకకు గురయ్యే విస్తీర్ణం, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం



పెండ్లిపాకల రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

నీటి నిల్వ సామర్థ్యం 251.5 ఎఫ్‌ఆర్‌ఎల్ ఉండగా, నిల్వ సామర్థ్యాన్ని పెంచితే తండాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వాయర్ ఎత్తు పెంచి నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు రూ.1,204కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అందులో భాగంగా 2,771 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, ఇప్పటి వరకు 1,917 ఎకరాలు సేకరించారు. 854 ఎకరాలకు అవార్డు పాస్ అవ్వగా, చెల్లింపులు చేయాల్సి ఉంది. ఈ రిజర్వాయర్ పూర్తయితే గ్రావిటీ ద్వారా జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం కలుగుతుంది. ఇదిలా ఉండగా, కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈ భద్రు, ఈఈ నెహ్రూనాయక్, డీఈ రాములు, ఏఈఈ భాస్కర్ రావు, శ్రావణ్, సతీష్ తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ పూర్తిచేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ కలెక్టరేట్): నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నెలాఖరు నాటికి పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో ప్రకారం నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. అందుకు లబ్ధిదారుల జాబితా రూపొందించాలని, ఈ నెల 21న లాటరీ ద్వారా ఎంపిక చేయాలని, ఎంపికైన లబ్ధిదారులకు 22న ప్రొసీడింగ్స్ సిద్ధం చేయాలన్నారు. వాటిని శాసనసభ్యులు, ప్రజాప్రతినిధుల ద్వారా పంపిణీ చేయించాలన్నారు. లాటరీ ద్వారా ఎంపిక విధానాన్ని వీడియోగ్రఫీ చేయించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవోలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిర్స ముండాను స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్

దేవరకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఆదివాసీ బిర్సా ముండా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ బంజారా భవన్‌లో నిర్వహించిన బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చత్రునాయక్ మాట్లాడుతూ, గిరిజన హక్కులు, భూముల కోసం బ్రిటీష్ పరిపాలనలో పోరాటం నిర్వహించిన బిర్సా ముండా ఆదర్శనీయుడన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సహాయ సంక్షేమాధికారి శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో దానియేల్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, గిరిజన సంఘం నేతలు లక్ష్మణ్ నాయక్, గరం సింగ్, గోపాల్ సింగ్, పాపనాయక్, రమావత్ దులిషానాయక్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి కృష్ణవేణి

చిట్యాలరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా శిశు, మహిళా సంక్షేమాధికారి కృష్ణవేణి అన్నారు. శనివారం మండల పరిధిలోని గుండ్రాంపల్లి, వనిపాకల, పెద్దకాపర్తి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నవయసులో వివాహాలతో పలు అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. లైంగిక వేధింపులపై 1098, 100, 1908, 181 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీడీపీవో లావణ్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించేందుకే 'ప్రజాబాట'

ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

నల్లగొండ టౌన్, చిట్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా 'ప్రజాబాట' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రత్నా ఫంక్షన్ హాల్‌లో 'ప్రజాబాట'పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు చిట్యాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిర్వహణను పరిశీలించారు. 'ప్రజాబాట'లో వారంలో మూడు రోజులు ఉదయం 8 నుంచి 1 గంటల వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. పెద్ద పనులకు అవసరమైతే ప్రతిపాదనలు పంపించాలని, వెంటనే బడ్జెట్ విడుదల చేస్తామన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలన్నారు. వచ్చే వేసవి యాక్షన్ ప్లాన్ అమలుకు ఇప్పటికే రూ.20కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. విద్యుత్ బకాలు వసూలు చేయాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, డీఈ అన్నయ్య, ఏడీఈ బాలునాయక్, ఏఈ రవీందర్, సిబ్బంది దామనూరి ఈశ్వర్, మెండె శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

ఎంజీయూ వీసీతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భేటీ



ఎంజీయూ వీసీతో భేటీ అయిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

నల్లగొండ టౌన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ఎంజీ యూనివర్శిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శనవారం వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లగా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వీసీ ఎమ్మెల్సీని శాలువాతో సన్మానించారు. అనంతరం హాల్‌లో ఎమ్మెల్సీ విద్యార్థులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సూదగాని హరిశంకర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి వట్టె జానయ్య యదవ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నర్సయ్యగౌడ్, కార్యదర్శి కొమ్మల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు నాగరాజు గౌడ్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, లింగం, పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాడుదాం

ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మురళి

నల్లగొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాడుతామని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి అన్నారు. శనివారం టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడి, పెండింగ్ సమస్యలు పరిష్కరించడంలో టీఎన్‌జీవోస్ సంఘం ముందంజలో ఉంటుందన్నారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. సరెండర్ లీవ్స్, మెడికల్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలపై పరిష్కారం కోసం 22 నెలలుగా ఎదురుచూస్తున్నామన్నారు. దీనిపై పలుమార్లు సీఎం, డిప్యూటీ సీఎం, ఉపసంఘానికి విన్నవించినా ఇంకా పెండింగ్‌లోనే ఉంచడం శోచనీయమన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులకు ప్రతీ నెల రూ.700కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కార్డులు మంజూరు చేయాలన్నారు. కమిటీలతో కాలయాపన చేయడం సరికాదన్నారు. పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతంతో ఫిట్‌మెంట్‌ను అమలు చేయాలన్నారు. 317జీవో బాధితులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాలకు అనుగుణముగా క్యాడర్ స్ట్రెంత్ పెంచాలన్నారు. అనంతరం సభ్యత్వనమోదును ప్రారంభించారు. సమావేశంలో టీఎన్జీవోస్ నాయకులు నరసింహాచారి, వంగూరి విజయకృష్ణ, ఏ.లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, గంగపుత్ర సైదులు, మధుసూదనాచారి, బి.రణదీవే, మధు, సిహెచ్.రాజశేఖర్, ప్రవీణ్, నారాయణస్వామి పాల్గొన్నారు.



సభ్యత్వాలు అందజేస్తున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు మురళి

వైద్యుల నిర్లక్ష్యం అని తేలితే చర్యలు



చిన్నారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో 17 మంది చిన్నారులకు అస్వస్థత విషయంలో వైద్యుల నిర్లక్ష్యం తేలితే చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆసుపత్రికి వచ్చి చిన్నారులను పరామర్శించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. డ్యూటీలో ఉన్న నర్సు, డాక్టర్‌తో మాట్లాడి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు ఇచ్చిన ఇంజక్షన్‌ను పరీక్షల కోసం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించామన్నారు. ఈ ఘటనపై కమిటీ వేశామని, రెండు రోజుల్లో కమిటీ నివేదికలు వస్తాయన్నారు. ఆ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డీసీహెచ్‌వో డాక్టర్ మాతృనాయక్, సీఎంవో డాక్టర్ భానుప్రసాద్‌నాయక్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్వారీలో కంప్రెషర్ బోల్తా పడి ఒకరి మృతి



ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన రాములు, ధ్వంసమైన కంప్రెషర్ ట్రాక్టర్ ఇంజన్

కేసముద్రం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లి సమీపంలోని గ్రానైట్ క్వారీలో శనివారం కంప్రెషర్ ట్రాక్టర్ బోల్తాపడి యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరుకు చెందిన గుంజ రాములు (53) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ క్రాంతి కిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం కంప్రెషర్ ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ అయిన గుంజ రాములు నాలుగేళ్ల క్రితం మండలంలోని అర్పనపల్లి గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. కాట్రపల్లి సమీపంలో శ్రీసాయిబాలాజీ క్వారీలో బండరాళ్లను పగులగొట్టే పనిని కొద్దిరోజులుగా నిర్వహిస్తున్నాడు. సాయంత్రం సమయంలో క్వారీ పైభాగంలో ట్రాక్టర్‌ను రాములు నడుపుతుండగా బ్రేకులు ఫెయిల్ కావడంతో క్వారీలోపల బోల్తాకొట్టింది. దీంతో రాములుపై కంప్రెషర్ ఇంజన్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాములకు భార్య లచ్చమ్మ, కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా తమకు పరిహారం చెల్లించేంత వరకు మృతదేహాన్ని తొలగించేది లేదని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఘటనా స్థలానికి కేసముద్రం సీఐ సత్యనారాయణ చేరుకొని పరిశీలించారు.

పంట నష్టాలతో పత్తి రైతు ఆత్మహత్య



సుఖేందర్‌రెడ్డి(ఫైల్)

నార్కట్‌పల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ పత్తి రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన మందడి సుఖేందర్‌రెడ్డి(40) బతుకుదెరువు కోసం 15 ఏళ్ల క్రితం నార్కట్‌పల్లికి వచ్చాడు. ఓ ప్రైవేట్ క్లినిక్‌లో ఆర్‌ఎంపీగా పనిచేస్తూ కుటుంబంతో సహా ఇక్కడే ఉంటున్నాడు. కాగా స్వగ్రామం పుల్లెంలలో ఉన్న భూమిలో పత్తిపంట సాగు చేశాడు. కాగా అకాల వర్షాలకు పంట దెబ్బతిని వరుస రెండేళ్లుగా పత్తి పంట సాగులో నష్టం వచ్చింది. దీంతో పంట సాగుకోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కనబడక తీవ్ర మనస్థాపానికి గురై ఈనెల 13వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని తనే భార్య శోభకు ఫోన్ ద్వారా తెలియపర్చాడు. గోపలాయపల్లి సమీపంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్న ఆమె ఇంటికి వచ్చి ఇరుగుపొరుగు వారి సాయంతో నల్లగొండలోని ఓప్రైవేటుఆసుపత్రికి తరలించింది. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సుఖేందర్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా వీరిద్దరిలో ఒకరు దివ్యాంగుడు. మేనమామ జితేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. కాగా సుఖేందర్‌రెడ్డి నేత్రాల్లోని కార్నియాను లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేకరించారు. సుఖేందర్‌రెడ్డి మృతితో పలువురు స్థానికులు దిగ్భ్రాంతి చెందారు. ప్రతీ ఒక్కరితో ఆప్యాయంగా ఉండే సుఖేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకుని చనిపోవడం కంటతడి పెట్టించింది. సుఖేందర్‌రెడ్డి మృతి పట్ల స్థానిక ఆర్‌ఎంపీ వైద్యులు సంతాపం తెలిపారు.

గొర్రె కడుపులో ఐదు కిలోల ప్లాస్టిక్ తొలగింపు

కోదాడ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శస్త్రచికిత్స ద్వారా గొర్రె కడుపులోంచి ఐదు కిలోల ప్లాస్టిక్‌ను తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట జిల్లా కోదాడలోని ప్రాంతీయ పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య వెల్లడించారు. మునగాల మండలం నర్సింహాపురం గ్రామానికి చెందిన వీరబోయిన ధనయ్య గొర్రె మేతమేయకపోవడం, పొట్ట ఉబ్బి ప్రమాదకరంగా ఉండడంతో శనివారం పశువైద్యశాలకు తీసుకువచ్చారు. గొర్రెను పరీక్షించి, అత్యవసరంగా శస్త్రచికిత్స చేయగా, ఊహించని విధంగా గొర్రె కడుపులో వడ్లకంటే ఎక్కువగా ఐదు కిలోల ప్లాస్టిక్ కవర్ల ముద్దలు బయటికి వచ్చాయన్నారు. ఆ వ్యర్థాలను తొలగించిన అనంతరం గొర్రె ప్రాణాపాయం నుంచి బయటపడిందని పెంటయ్య తెలిపారు. గొర్రెలను జనావాస ప్రాంతాల్లో, చెత్తాచెదారం ఉన్న ప్రాంతాల్లో మేపడం ద్వారా తినుబండారాలతో పడేసిన ప్లాస్టిక్ కవర్లను ఆహారంతో పాటు నమిలి తింటాయన్నారు. ఒక్కసారి ప్లాస్టిక్ కవర్లు కడుపులోకి వెళ్తే ఎప్పటికీ అరగవని, కరగవని పశువులు నరకయాతన పడాల్సి వస్తోందన్నారు. గొర్రెల కాపరులు మేపు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. శస్త్రచికిత్సలో సిబ్బంది రాజు, చంద్రకళ, అఖిల్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేట రూల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలోని సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై పిల్లలమర్రి వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు తెలియజేయడంతో సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ నర్సింహ సంబంధిత అధికారులతో పరిశీలించారు. మృతదేహం సమాచారాన్ని తెలుసుకోవడానికి స్పెషల్ పోలీస్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఘటనా స్థలాన్ని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించారు. త్వరలోనే వివరాలు గుర్తిస్తామని ఎస్పీతెలిపారు. మృతునికి సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, తెల్లని గల్ల చొక్క, బ్లూ జీన్స్ పాయింట్ ధరించిఉన్నాడు. ఆనవాళ్లు గుర్తించిన వాళ్లు సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ 8712686006కు తెలియజేయాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐలు రాజశేఖర్, రామారావు, రూరల్ ఎస్‌ఐ బాలునాయక్, క్లూస్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

ఊరంతా బోర్‌వెల్స్‌తో ఉపాధి

● ఇడికుడ టూ విదేశాలకు బోర్‌వెల్స్

సండే స్పెషల్ SUNDAY SPECIAL

ప్రతీ గ్రామంలో వివిధ రకాల వృత్తులు, పనులపై ఆధారపడి జీవిస్తుంటారు. కానీ నల్లగొండ జిల్లా చండూరు మండలం ఇడికుడ గ్రామంలో మాత్రం దాదాపుగా 85 శాతం మంది బోర్‌వెల్స్ మీద ఆధారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం ఆ గ్రామంలో సుమారు 350 గడప 1,100 మంది జనాభా ఉండగా పురుషుల్లో 85 శాతం మంది బోర్‌వెల్స్ రంగంలోనే ఏదో ఒక పనిలో ఉంటూ వారి ఆర్థికస్థితిని మెరుగుపరుచుకుంటున్నారు. బోర్‌వెల్స్ రంగం ఆ గ్రామ ఆర్థిక స్థితి గతిని పూర్తిగా మార్చివేసింది.

(ఆంధ్రజ్యోతి-చండూరు రూరల్)



విదేశాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బోర్‌వెల్ బండి

ఇడికుడ గ్రామస్థులు గతంలో ఎక్కువగా వ్యవసాయం చేస్తుండేవారు. మరికొందరు హైదరాబాద్ లాటి దూర ప్రాంతాలకు వెళ్లి ఆటో డ్రైవర్లు, కూలీ పనులు చేస్తుండేవారు. మహిళలు తమ భూముల్లోని వ్యవసాయ పనులు చూస్తుండేవారు. ఇటీవల యువత ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. బోర్‌వెల్ రంగంలో అనుభవంతో గ్రామంలో సుమారు 50 మంది సొంతంగా బోర్‌వెల్ వాహనాలు కొనుగోలు చేశారు. అందులో సగానికి పైగా ఇతర దేశాలలో నడిపిస్తుండటం గమనార్హం.

ఇడికుడ టూ విదేశాలకు..

దేశంలో బోర్‌వెల్స్ పనులు నిర్వహిస్తున్న కొంతమంది డ్రిల్లర్లు సౌత్‌ఆఫ్రికాలో బోర్‌వెల్స్‌పై డ్రిల్లింగ్ చేసేందుకు పని కుదుర్చుకుని వీసాలు తీసుకుని అక్కడకు చేరుకున్నారు. అక్కడ పని చేసే సమయంలో అక్కడి బోర్‌వెల్స్ అంతగా ఆధునికంగా లేకపోవడంతో చిన్నచిన్నగా అక్కడి కాంట్రాక్టర్లతో మాట్లాడి ఇక్కడి బోర్‌వెల్స్‌ని అక్కడకి నౌకాయానం ద్వారా తరలించారు. అలా ఇడికుడ గ్రామానికి చెందిన వారివి సౌత్‌ఆఫ్రికా, జాంబియా వంటి దేశాలలో సుమారు 25 బోర్‌వెల్స్ నడుస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు.

మొదటి వ్యక్తి సత్తయ్య

గ్రామానికి చెందిన బోయపల్లి సత్తయ్య స్థానికులకు బోర్‌వెల్ పని పరిచయం చేశారు. చిన్నవయస్సులోనే పెద్దరైతులు, దొరల దగ్గర జీతం చేస్తూ ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకున్నాడు. 1970లో రాయ్‌చూర్, సింగనూర్ వంటి ప్రాంతాల్లో ట్రాక్టర్ల ద్వారా బోర్లు వేస్తున్నారని, డ్రైవర్లు, వర్కర్లు కావాలని తెలియడంతో అక్కడకి చేరుకుని బోర్‌వెల్ పనిని నేర్చుకున్నాడు. ఐదేళ్ల తర్వాత ఇడికుడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సోదరుడు పాల్వాయి ప్రేమ్‌చందర్‌రెడ్డి మొదటి సారి బోర్‌వెల్ బండి కొనుగోలు చేయడంతో దానిపై పనిచేసుకుంటూ గ్రామంలో మరికొంత మందికి బోర్‌వెల్ పనిని నేర్పించాడు. అలా మొదలైన ప్రస్తానం చిన్నచిన్నగా గ్రామంలో బోర్‌వెల్స్ వస్తున్న లాభాలు చూసి ప్రతి ఒక్కరూ ఆ పనికి మొగ్గు చూపి రాణిస్తున్నారు.



బోర్‌వెల్ డ్రైవర్ నుంచి సర్పంచ్

ఇడికుడ గ్రామానికి చెందిన నల్ల లింగయ్యయాదవ్ గతంలో గ్రామంలో వ్యవసాయం చేస్తూ లారీ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ ఉండేవాడు. కాగా బోర్‌వెల్స్‌పై ఆదరణ పెరుగుతుండటంతో మక్కువతో సొంతంగా బోర్‌వెల్స్ కొనుగోలు చేసి నెమ్మదిగా ఆర్థికంగా నిలదొక్కుకుని సొంతంగా కంపెనీ ఏర్పాటు చేసుకుని ఇతర దేశాల్లో సైతం బోర్‌వెల్స్ నడిపిస్తూ ఉన్నాడు. గ్రామస్థుల సూచన మేరకు 2019 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున గ్రామంలో సర్పంచ్‌గా నిలిచి గెలిచాడు.

మా వృద్ధికి బోర్‌వెల్స్ తోడ్పడ్డాయి



ఇడికుడ గ్రామంలో బోర్‌వెల్స్‌తో ఎంతోమంది ప్రయోజకులయ్యారు అందులో నేను ఒకడిని. కష్టపడి చదివితే జాబ్ వస్తుందో రాదో తెలియదు కాని, మా గ్రామంలో మాత్రం కష్టపడి పనిచేస్తే తప్పకుండా పని దొరుకుతుంది. అలా మా గ్రామంలో చాలామంది యువత ప్రభుత్వ ఉద్యోగాలవైపే కాకుండా ఇలా సొంతంగా తమకాళ్లపై తాము నిలబడటానికి ఈ బోర్‌వెల్స్ ఎంతో తోడ్పడ్డాయి.

ఇరిగి కిరణ్, బోర్‌వెల్స్ డ్రిల్లర్ కం డ్రైవర్

ఉపాధికి కొదువ లేదు



మా గ్రామంలో ఉపాధికి కొదువ లేదు. ఏ చదువు చదవకపోయినా, ఏ జాబ్ రాకపోయినా కనీసం బోర్‌బండి మీద రాడ్లు మోసుకుంటనైనా బతుకుతం. అదే తరహాలో నేను కష్టపడి బోర్‌వెల్స్ పనినేర్చుకుని డ్రిల్లర్ కం డ్రైవర్‌గా చేసుకుంటూ ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు లేకుం డా జీవిస్తున్నాం. ఒక ప్రభుత్వ ఉద్యోగికి తీసిపోని విధంగా ఉంటాం.

పంతంగి గిరి, బోర్‌వెల్ యజమాని

వృద్ధుల సంరక్షణను ఎవరూ మరవద్దు



వయోవృద్ధుల వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి(కలెక్టరేట్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధులను వేధించడం చట్టరీత్యా నేరమని, సీనియర్ సిటిజన్ యాక్ట్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. ఈ నెల 12 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించి, మాట్లాడారు. వయోవృద్ధులకు వారసుల వేధింపులు అధికంకావడంతో, భరించలేక ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ట్రిబ్యునల్ ద్వారా వారు సాంత్వన పొందుతున్నారన్నారు. తల్లిదండ్రుల పోషణ, సంక్షేమం విస్మరించిన వారసులపై చర్యలు తీసుకోవడానికి చట్టం అమలులో ఉందన్న విషయాన్ని మరువరాదన్నారు. వృద్ధులపై వివక్ష, విస్మరణ చేస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కొండాపురం నర్సింహారావు, తెలంగాణా ఆల్ సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రగుంట వెంకటేశం, సీడీపీవో శైలజ, డీడబ్ల్యువో సూపరిండెంట్ శశికళ, యశోద, సీనియర్ సిటిజన్లు సత్యనారాయణ, అంజయ్యరవీందర్, బాలేషం, నర్సింగరావు తదతరులున్నారు.

ఆపరేషన్ చేస్తుండగా డాక్యుమెంట్ రైటర్ మృతి



అనిల్(ఫైల్)

హుజూర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుండె సంబంధిత ఆపరేషన్ జరుగుతుండగా డాక్యుమెంట్ రైటర్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కాయితి అనిల్(27) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అతడికి గుండె ఆపరేషన్‌కు చేస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనిల్ మృతికి సబ్‌రిజిస్ట్రార్ షఫీ, డాక్యుమెంట్ రైటర్ల సంఘం నాయకులు షేక్‌నాగుల్ మీరా, బాలకృష్ణ, అష్రఫ్ అలీ, కావ్ల వీరేశ్వరరావు, అలీం, జానీపాషా, గోపీ తదితరులు సంతాపం తెలిపారు.

భావిపౌరులుగా ఎదగాలి

కట్టంగూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహనతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని నకిరేకల్ సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవా కమిటీ అధికారి మంజుల సూర్యావర్ అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని చిన్నపురి ముత్యాలమ్మగూడెంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. సదస్సులో సీనియర్ అడ్వకేట్ ప్రకాశ్‌రావు, సోమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పటేల్ గొప్ప మానవతావాది



సమావేశంలో మాట్లాడుతున్న వర్షిత్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంస్థానాలను భారత సమాఖ్యలో విలీనం చేసిన గొప్ప మానవతావాది సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలో రాష్ట్రీయ ఏకతా దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఎంపీ రఘువీర్‌రెడ్డి పాల్గొనకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పటేల్‌ను ఆదర్శంగా తీసుకొని జాతినిర్మాణంలో ముందజలో ఉండాలన్నారు. సమావేశంలో మండల వెం కన్న, పక్కీర్ మోహన్‌రెడ్డి, మిర్యాల వెంకటేశం, మదుసూదన్ రెడ్డి, శివరాంకృష్ణ, శాంతి స్వరూప్, వెంకన్న పాల్గొన్నారు.

విద్యతోనే సంపూర్ణ వికాసం: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

శాలిగౌరారం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే సంపూర్ణ వికాసం ఏర్పడి దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడానికి మార్గదర్శకత అవుతుందని నల్లగొండ ఆర్‌డీవో యారాల అశోక్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారంలోని గీతాంజలి స్కూల్‌లో శనివారం రెండవ రోజు నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. చిన్నారులకు సంపూర్ణ వికాసం విద్యతోనే సాధ్యమన్నారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి వారిని భావి పౌరులుగా తీర్చిద్దిదే బాధ్యత గురువులదేనన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. దేశ సంస్కృతి, సాంప్రదాయాలను ఉట్టి పడేలా, వివిధ వేషధారణలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నర్సరీ నుంచి 10వ తరగతి విద్యార్థులు వివిధ పాటలకు నృత్య ప్రదర్శనలు తల్లితండ్రులను ఎంతో అలరించాయి. కార్యక్రమంలో గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ దొంతూరి పరమేశ్వర రావు, ప్రిన్సిపాల్ ప్రభంజ ప్రభంజన్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష బిల్వార్చన



సూర్యాపేటరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలోని పిల్లలమర్రి శివాలయాలల్లో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం లక్ష బిల్వార్చనను ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు.

రైతుల పేరుతో దళారుల పత్తి దందా

(ఆంధ్రజ్యోతి-మునుగోడు)

పత్తి రైతులు సాగు చేయడానికి తోడు విక్రయానికి కూడా శ్రమించాల్సి వస్తోంది. వర్షాలతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. పండిన కొద్దిపాటి పంటలను కొనుగోలు కేంద్రాలో విక్రయించడానికి నిబంధనల పేరుతో రైతులు అగచాట్లకు గురవుతున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తమ ఇంటి వద్దనే దళారులకు అడిగిన ధరకు విక్రయిస్తున్నారు. దళారులు మాత్రం అదే పత్తిని కొనుగోలు కేంద్రాల్లో రైతుల పేరున విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో రైతులకు దక్కాల్సిన మద్దతు దళారులకే దక్కుతోందని విమర్శలు ఉన్నాయి. మునుగోడు నియోజకవర్గంలో బహిరంగంగా కొనసాగుతున్న ఈ దందాపై అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

తగ్గిన పత్తి దిగుబడులు

మునుగోడు నియోజకవర్గం ఆయకట్టేతర ప్రాంతం. కేవలం వర్షాధారంపై ఆధారపడిన వ్యవసాయ పంటలను సాగవుతాయి. ఈ ప్రాంతంలో పత్తి ప్రధానం పంటగా అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. సాగు కోసం ఎకరాకు రూ.45వేలకు పైగా ఖర్చుపెట్టారు. ఎకరాకు 10 నుంచి 15క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించినా రైతులకు నిరాశ మిగిలింది. సీజన్ ఆరంభంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, పంట చేతికొచ్చే సమయంలో తుపాన్, అకాల వర్షాలతో తడిసి ముద్దయ్యింది. దీంతో చేతికొచ్చిన పత్తి పంట దెబ్బతింది. ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల సైతం రావటం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. కొందరు రైతులకు మాత్రం 7నుంచి 10క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుందని తెలుస్తోంది. అధిక భాగం 5 క్వింటాళ్ల లోపు పత్తి దిగుబడి వచ్చిందంటే గగనమే అని రైతులు తెలిపారు.



మునుగోడు మండలంలో డీసీఎం నుంచి ట్రాక్టర్లకు ఎక్స్‌కవేటర్లతో పత్తిని ఎత్తుతున్న దళారులు, సీసీఐ కేంద్రం వద్ద వరుసలో దళారులు తెచ్చిన పత్తి ట్రాక్టర్లు

తేమ నిబంధనలతో విసుగు

చేతికొచ్చిన కొద్దిపాటి పంటను సీసీఐ కొనుగోలు కేంద్రంలో విక్రయించుదామంటే తేమ పేరుతో నిబంధనలు అడ్డుపడుతున్నాయి. 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు. వర్షాలతో తేమ శాతం తగ్గక పోవటంతో పత్తిని ఆరబెట్టడం, ఇంట్లో నిల్వ ఉంచుకోవటం కష్టంగా మారింది. సీసీఐ కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించడం కోసం ఖర్చులు పెరగటంతో కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. సాగు ఖర్చులు పెరిగిపోవటంతో విధిలేక దళారులను ఆశ్రయిస్తూ అడిగిన ధరకు పత్తిని విక్రయిస్తున్నారు.

తక్కువ ధరకు

దళారులు క్వింటా పత్తిని రూ.6,500 కన్నా తక్కువ ధర కట్టిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సీసీఐ కేంద్రంలో ధరతో పోలిస్తే రూ.1500-రూ.2000లకు పైగా తేడా ఉంటోంది. ఇలా తక్కువ ధరకు పత్తి వస్తుండటంతో గ్రామాల్లో దళారులు తమ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. రైతుల నుంచే కొనుగోలు చేసిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో రైతుల పేరున విక్రయిస్తూ దళారులు ధనార్జనకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

రైతుల నుంచి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి, అదే పత్తిని సీసీఐ కేంద్రంలో విక్రయించడం నిబంధనలకు విరుద్ధం. రైతుల కోసమే సీసీఐ కేంద్రాలను ఏర్పాటుచేశారు. రైతులు పత్తి పంటను తీసుకొచ్చి మద్దతు పొందాలి. దళారులు చేసే అక్రమ వ్యాపారాలు నా దృష్టికి రాలేదు. అలాంటి వాటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం.

నేలపట్ల నరేష్, తహసీల్దార్, మునుగోడు

దళారులు రైతుల పేరుతో పత్తి దందా తీరు

గ్రామ పరిసర ప్రాంతాల్లో రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొన్న దళారులు గ్రామాల్లో వారి నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇలా రైతుల ఇంటి వద్ద కొనుగోలు చేసిన పత్తిని కొందరు ట్రాక్టర్లలో, మరికొందరు డీసీఎంలు, లారీలలో లోడ్ చేసుకొని వస్తున్నారు. గ్రామాల్లో తమకు అనువైన చోట పత్తిని తోడుకొని ట్రాక్టర్లలో ఎత్తుకొని సీసీఐ కేంద్రాలకు తరలిస్తూ అక్కడ ఏదో ఒక రైతు పేరున దర్జాగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే తరహాలో రెండు రోజుల కిందట మునుగోడు మండలంలోని ఓగ్రామంలో రైతువేదిక పక్కనే డీసీఎంలో పత్తిని ట్రాక్టర్లలోకి జేసీబీ ద్వారా లోడు చేశారు. ఆ ట్రాక్టర్లను అదే గ్రామంలోని సీసీఐ కేంద్రానికి తరలించి విక్రయించారు. ఇలా నిత్యం జరిగే వ్యవహారం అని తెలుస్తోంది. ఇంత పెద్దమొత్తంలో జరుపుతున్న అక్రమ పత్తి వ్యాపారంపై ఎవరూ పట్టించుకోవటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. పత్తి అక్రమ వ్యాపారంపై ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పట్టించుకుని రైతులు మోసపోకుండా దళారీ మోసాల నియంత్రణకు వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చైన్‌హార్వెస్టర్లకు డిమాండ్

(ఆంధ్రజ్యోతి-పెద్దఅడిశర్లపల్లి)



నీళ్లలోనే వరి పంటను కోస్తున్న చైన్‌హార్వెస్టర్

తడారని పంట పొలాలతో వరి కోతలు ఆలస్యమవుతున్నాయి. ఓ వైపు పెట్టుబడుల భారం కాగా, మరోవైపు చేతికందే పంటను దక్కించుకునేందుకు రైతుల పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. భారీవర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. తుపాన్ కారణంగా చెరువు, కుం టలు నిండి పొంగిపొర్లాయి. వాగులు ఉప్పొంగాయి. వర్షాల కారణంగా భూగర్భజలాల మట్టం పెరిగి పంట పొలాల్లో నీరు ఉబికివస్తూ పొలాలు జాలువారుతున్నాయి. నేటికి పొలాల్లో నీటి జాలు తగ్గకపోవడంతో వరి పంట చేతికందకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది టైర్ హార్వేస్టర్లతో వరి పంటలు కోయగా ఈ ఏడాది పొలాల్లో నీరు ఉండడంతో టైర్ హార్వేస్టర్లకు పని లేకుండా పోయిందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అంతటా చైనా హార్వేస్టర్ల అవసరం పెరగడంతో వాటికి భారీగా డిమాండ్ పెరిగింది. యాంత్రీకరణ వరి సాగుకు అలవాటు పడిన రైతుకు వరి సాగు పెట్టుబడి కూడా పెరిగింది.


చేతికందిన వరి పంట చేనులోనే..

ఒకప్పుడు రైతులు పత్తి, వేరుశనగ, కూరగాయల పంటలు సాగు చేసేవారు. ప్రస్తుతం 80 శాతం వరి పంటనే సాగు చేస్తున్నారు. భారీవర్షాలతో చెరువులు, కుంటలు నిండాయి. వరుసగా వర్షాలు పడడం, చెరువులు, కుంటలు పొంగిపొర్లడడం, వాగులు, వంకల్లో నీరు పుష్కలంగా ఉండడంతో భూగర్భజలాలు ఉబికి వస్తున్నాయి. ఇప్పటికే వరి పొలాల్లో తడారనే లేదు. టైర్ హార్వేస్టర్లు పొలాల్లోకి వెళ్తే దిగబడి బయటకు వచ్చే పరిస్థితి లేదు. చైన్ హార్వేస్టర్‌కు గంటకు రూ.3500 నుంచి రూ.4 వేల వరకు పెంచారు. ఆ ధర మరింతగా పెరిగిపోతోంది. రైతులు చైన్‌హార్వేస్టర్ల చుట్టూ తిరుగుతున్నా దొరకడం లేదు. దీంతో వరి పంట చేనులోనే ఉండిపోతోంది.

తగ్గిన దిగుబడి..

వర్షాలతో వరి పంట రైతులను నిలువునా ముంచింది. వానాకాలంలో వేసిన వరి పంట చేతికందక రైతులు నానాతంటాలు పడుతున్నారు. ఈ సీజన్‌లో సాగు చేసిన వరి కన్నీళ్లే మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి పెరిగిందని దిగుబడి అంతంతేనని కన్నీరుమున్నీరవుతున్నారు.

11 ఎకరాల్లో సాగు



ఈ సీజన్‌లో వరి పంట దిగుబడి చాలా తగ్గింది. 11 ఎకరాల్లో వరి పంట వేసిన. గతంలో ఎకరానికి 40నుంచి 45బస్తాల ధాన్యం వచ్చేది. ప్రస్తుతం 20నుంచి 30బస్తాలే వస్తుంది. గతంలో 11 ఎకరాల్లో 500 బస్తాలు రాగా.. ప్రస్తుతం 300 బస్తాలే వచ్చాయి.

సూరబోయిన శ్రీనివాసులు, గుడిపల్లి.

గుమ్మడితో లాభాలెన్నో..!

● వాస్తు దోష పరిహారార్థమంటున్న పురోహితులు ● ఆరోగ్యాన్నిస్తుందంటున్న వైద్యులు



దిష్టికి.. పుష్టికి.. గుమ్మడి అనేది సంప్రదాయంగా వస్తున్న సామేతే. అయితే అన్ని సామేతల్లాగా కాకుండా అంతకుమించిన అద్భుత ఫలాతాలిచ్చే గుమ్మడికాయతో అనేక లాభాలున్నాయి. ఆరోగ్యంగా ఉన్న వారికీ, అనారోగ్యంతో బాధపడుతున్న వారికీ మేలు చేసేదే గుమ్మడి. కృత్య విధులతోపాటు శుభకార్యాల్లో గుమ్మడిని ఉపయోగించడం తాతల కాలం నుంచి ఆచారంగా వస్తోంది. అయితే ఇటీవలి కాలంలో గుమ్మడికాయల వినియోగం పెరిగింది.

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

నూతన గృహమైనా, కొత్తగా ప్రారంభించే వ్యాపారమైనా, అత్తారింట్లో అడుగిడే అమ్మడి ముంగిటైనా గుమ్మడి కొట్టడం తెలిసిందే. వాస్తు దోష పరిహార్థంగా భావించే గుమ్మడికి అంత శక్తి ఉందంటున్నారు పండితులు. దుష్టి దోష పరిహారం కలిగించడంతో పాటు వాస్తు దోషాలను సమర్థంగా అరికట్టే గుణం కలిగింది గుమ్మడి. స్వతహాగా వైబ్రేషన్స్(ప్రకంపనలు) కలిగే గుమ్మడి కాయను ఇల్లు లేదా వ్యాపార, వాణిజ్య సముదాయాల ముందు కడితే దుష్టశక్తులు లోపలకు రావంటున్నారు పురోహితులు.

సైన్స్‌తోపాటు జ్యోతిష్య శాస్త్రానికి..

గుమ్మడికాయలో సైన్స్‌తోపాటు జ్యోతిష్య శాస్త్రానికి అనుసంధానంగా ఉండే గుణాలున్నాయనే వారున్నారు. చెడును చెడు(దుష్టశక్తుల)ను స్వీకరించి, తనలో నిక్షిప్తం చేసుకుంటుందని వేదపండితులంటున్నారు. దుష్ట చూపు లోనికి రానియ్యకుండా అడ్డుపడుతుందని, అలాంటి సందర్భాల్లో గురయ్యే వారి ఇంటిముందు కట్టిన గుమ్మడికాయలు త్వరగా పాడవుతాయనే అభిప్రాయముంది. ఇక తెలిసో, తెలియని వాస్తులోపాలను సరిదద్దే గుణం గుమ్మడికాయకుందంటున్నారు పండితులు.



మిర్యాలగూడలోని ఎన్నెస్పీ క్యాంపులో గుమ్మడిజ్యూస్ తయారీ చేస్తున్న నిర్వాహకుడు

ఆరోగ్యానికి గుమ్మడి..

విటమిన్లు, ఖనిజ లవణాలతో కూడిన గుమ్మడి ఆరోగ్యప్రదాయమంటున్నారు వైద్యులు, చలువ చేసే గుణమున్న గుమ్మడికాయ రసాన్ని పరిగడుపున తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, గుండె, చర్మ సంబంధిత రోగాలు దరి చేరనివ్వదని వైద్యులంటున్నారు. ఇందులో ఉండే విటమిన్-ఏ, సీ, బీటా కెరోటిన్ రూపంలో శరీరంలో కలిగే పలురకాల ఇన్ఫెక్షన్లను పారదోలుతుందంటున్నారు. ఇక గుమ్మడికాయలో ఉండే ఫైబర్, ట్రిప్టోఫాన్, పొటాషియం, మేగ్నీషియం, తామ్రం అనేక రకాల లాభాలు చేకూరుస్తుందని వైద్యులంటున్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నివారిణిగా..

గుమ్మడికాయ రసం మధుమేహం, థైరాయిడ్, హృద్రోగం, ప్రొస్టేట్, కిడ్నీ తదితర దీర్ఘకాలిక వ్యాధుల బారి నుంచి రక్షిస్తుందని పలు పరిశోధనలు నిరూపించాయి. యాంటి ఆక్సిడెంట్లతో నిండిన పంప్‌కిన్ జ్యూస్ హానికర రియాక్టివ్ ఆక్సిజన్ స్పీషీస్‌ను తగ్గించే గుణమున్న గుమ్మడి అసిడిటీ, అల్సర్‌ను నివారిస్తుంది. క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశాలను తగ్గించడంతో పాటు వృద్ధాప్య ఛాయలు రాకుండా చేస్తుందని, నాడీ వ్యవస్థ పనితీరును స్థిరీకరించడంతో పాటు బాడీ డిటాక్స్, లివర్ పనితీరును మెరుగుపరుస్తుందని పలు ఆరోగ్య నివేదికలు పేర్కొన్నాయి. ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చే గుమ్మడి కాయ రసాన్ని తీసుకోవాలంటున్నారు వైద్యులు.


ఎన్నో.. ఎన్నెన్నో రకాలుగా..

గుమ్మడికాయల నుంచి రసం తీసి జ్యూస్‌గా సేవిస్తే సర్వరోగ నివారిణిగా పనిచేస్తుంది. ఇక గుమ్మడికాయలతో వడియాలు చేసుకోవడం అమ్మమ్మలు నేర్పిందే. బూడిద గుమ్మడితో పాటు మంచి గుమ్మడిని కూరగాయగా వాడుతున్నారు. గుమ్మడికూర, గుమ్మడి హల్వా, గుమ్మడి స్వీట్లను శుభకార్యాలలో అతిధులకు వడ్డిస్తున్నారు. ఇక ఆంధ్రా వంటకాల్లో గుమ్మడి పులుసు, పుల్లగుజ్జు కూర, బెల్లం కూర తప్పకుండా ఉండనే ఉంటుంది.

గుమ్మడి గింజల వాడకం అలనాటి నుంచే..

ఇటీవల కాలంలో గుమ్మడికాయ వినియోగం పెరిగిన మాట వాస్తవమే. అయితే గుమ్మడి గింజల వినియోగం తాతల కాలం నుంచే ఉంది. పేరొందిన స్వీట్, డ్రై ఫ్రూట్స్ షాపుల్లో గుమ్మడి గింజల కొనుగోలు కొత్తేమీకాదు. చూపునకు చిన్నదైనా.. గుమ్మడి గింజలు చేసే మేలు పెద్దదేనంటున్నారు ఆరోగ్య నిపుణులు.

వాస్తుదోష నివారిణి



గుమ్మడికాయ శ్రేష్ఠమైనది. పసుపు, కుంకుమలతో అలంకరించిన గుమ్మడికాయకు దోష పూజ జరిపి, ఇంటి ముందు కట్టుకుంటే అంతా శుభమే జరుగుతుంది. దుష్ట దోష పరిహారిణి అయిన గుమ్మడికి ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడంతోపాటు కుటుంబ శాంతిని కలిగిస్తుంది. చెడును స్వీకరించి మంచిని అందించే గుణమున్న గుమ్మడి, వాస్తు దోషాలను అరికట్టడంలో సమర్థవంతంగా పని చేస్తుంది.

పల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, పురోహితులు, మిర్యాలగూడ.

గుమ్మడికాయ రసం ఆరోగ్యానికి మంచిది



ఇందులో పోషక విలువలు మెండుగా ఉంటాయి. పొటాషియం, మెగ్నీషియం, జింక్, విటమిన్-కే, ఫైబర్ ఉండే గుమ్మడిని ఏ రూపంలో తీసుకున్నా మంచిదే. రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు అధిక బరువును తగ్గిస్తుంది. చర్మం, జుట్టు సంరక్షణకు దోహదపడే గుమ్మడికాయకు చిరాకు, ఆందోళన, నిద్రలేమి సమస్యలకు పరిష్కారం చూపే గుణాలున్నాయి. మూత్ర సంబంధిత వ్యాధిగ్రస్తులకు మంచి డ్రింక్ ఇది. ఎలాంటి సందేహం లేకుండా గుమ్మడిని తీసుకోవచ్చు. అయితే ఫుడ్ ఎలర్జీ ఉన్నవారు వైద్యుల సలహా మేరకే వాడాలి.

డాక్టర్ వసంత్, అసోసియేట్ కన్సల్టెంట్, యూరాలజీ

డైలీ కస్టమర్లున్నారు



గుమ్మడికాయ రసం తాగే డైలీ కస్టమర్లున్నారు. గుమ్మడి రసమొక్కటే తాగుతుండగా, మరికొందరు అందులో కొత్తిమీర, పూదీనా, అల్లం, నిమ్మ రసం మిక్స్ చేసి ఇవ్వమంటున్నారు. వాకింగ్, జాగింగ్, షటిల్ ఆటకు వచ్చేవాళ్లు ఇక్కడ గుమ్మడి రసం తాగడంతో పాటు పార్సిల్ కూడా తీసుకెళ్తున్నారు. వారి ఆసక్తికి తగినట్లుగా తాజా జ్యూస్ తయారు చేసిస్తున్నాం. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో గుమ్మడికాయ రసం తాగేవారి సంఖ్య పెరుగుతోంది.

సుందర్, వెజిటబుల్ జ్యూస్ వెండర్, మిర్యాలగూడ.

అంగన్‌వాడీల సేవలు

అంతంత మాత్రమే

(5వపేజీ తరువాయి)



ఉండగా, వాటిలో 76,494 మంది చిన్నారులు, 8,550 మంది గర్భిణులు, 6,600 మంది బాలింతలు నమోదయ్యారు. సూర్యాపేట జిల్లాలో 1,209 కేంద్రాలు ఉండగా, వాటిలో 47,160 మంది చిన్నారులు, 5,920 మంది గర్భిణులు, 3,860 మంది బాలింతలు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో 501 టీచర్ పోస్టులు ఖాళీ

ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి ఒక టీచర్, ఒక ఆయా ఉండాలి. మినీ అంగన్‌వాడీ కేంద్రానికి మాత్రం టీచర్ ఒక్కరే ఉంటారు. యాదాద్రి జిల్లాలో 901 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 266 టీచర్ పోస్టులు, 58 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 1,209 కేంద్రాలు ఉండగా 85 టీచర్ పోస్టులు, 290 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 2,093 కేంద్రాలు ఉండగా, 150 టీచర్ పోస్టులు, 684 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మోత్కూరు ఐసీడీఎస్ పరిధిలో టీచర్లు, ఆయాలు లేకుండా 20 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు తెరుచుకోవడం లేదు. కానీ గుడ్లు, బియ్యం, పప్పు తదితర సరుకులు వచ్చినప్పుడు సమీప అంగన్‌వాడీ కేంద్రం టీచరో, ఆయానో వెళ్లి వాటిని తీసుకుని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ ఇస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలో 17 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎవరో ఒక్కరే ఉన్నారు. టీచర్ ఉన్న కేంద్రంలో ఆయా లేరు, ఆయా ఉన్న కేంద్రంలో టీచర్ లేరు. దత్తప్పగూడెంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా టీచర్లు, ఆయాలు లేక ఏడాదికి పైగా తెరుచుకోవడం లేదు. కొద్ది రోజులుగా పాలడుగు నుంచి ఒక ఆయాను పంపగా, రెండు కేంద్రాలు కలిపి ఒకే చోట నడుపుతున్నారు. సిబ్బంది కొరతతో తమపై పనిభారం పడుతోందని ఉన్న సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సక్రమంగా అందని పౌష్టికాహారం

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందడంలేదనే విమర్శలు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులు రక్తహీనతకు గురికాకుండా, శారీరకంగా బలంగా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతీ రోజు పాలు, ఉడకబెట్టిన కోడిగుడ్డుతో పాటు ఆకుకూరలు, ఇతర కూరలతో పౌష్టికాహారం అందించాలి. చిన్నారుల ఆరోగ్య సమస్యలు, వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు పెరుగుతున్నారా? లేదా? అనేది రిజిస్టర్‌లో నమోదు చేయాలి. బలహీనంగా ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కేంద్రాల్లో టీచర్లు ఉంటేనే ఇవన్నీ సాధ్యం. టీచర్లు, ఆయాలు లేక అంగన్‌వాడీ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

టీచర్, ఆయా పోస్టుకు మారిన నిబంధనలు

టీచర్ పోస్టుకు గతంలో పదోతరగతి ఉత్తీర్ణత అయితే సరిపోయేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించింది. వయోపరిమితి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొంది. 50శాతం టీచర్ పోస్టులను అర్హత ఉన్న ఆయాలతో భర్తీ చేయవచ్చని నిబంధనల్లో పేర్కొంది.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని నిరుద్యోగ మహిళలు కోరుతున్నారు. కాగా, ఖాళీల వివరాలు ప్రభుత్వానికి అందించామని, రాష్ట్ర ప్రభుత్వం వాటి భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందని ఐసీడీఎస్ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

సాగర్ మీనం... భలే రుచికరం

● పర్యాటకులను ఆకర్షిస్తున్న సాగర్ చేపల వంటకాలు ● మత్స్యకారులకు ఉపాధిగా మారిన చేపల ఫ్రై విక్రయాలు ● వారాంతాల్లో పర్యాటకుల రద్దీ



సాగర్‌లో చేపల ఫ్రై చేస్తున్న మహిళ



ఘుమఘుమలాడే చేపల ఫ్రై

నాగార్జునసాగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ అనగానే ప్రతిఒక్క పర్యాటకునికి గుర్తుకు వచ్చేది అసియా ఖండంలోనే అతిపెద్ద మానవ నిర్మిత రాతి కట్టడం అయిన డ్యాం. ఆ తర్వాత గుర్తుకు వచ్చేది ఘుమఘుమలాడే చేపల ఫ్రై. సాగర్ తీరంలో మత్స్యకారులు చేసే చేపల ఫ్రై, పచ్చళ్లు భలే రుచికరంగా ఉంటాయి. ఇందుకు కారణం వారు ప్రత్యేకమైన మసాల కారం. సాగర్‌కు వచ్చే ప్రతీ పర్యాటకుడు సాగర్ డ్యాం, సహజమైన అందాలను తిలకించిన తర్వాత స్థానికంగా లభించే తాజా చేపల ఫ్రై తినేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మొత్తం 500 కుటుంబాలు

సాగర్ హిల్‌కాలనీ, ఫైలాన్ కాలనీల్లో కలిసి మొత్తం 500 కుటుంబాల వరకు మత్స్యకారులు విశాఖపట్నం నుంచి ఆరు దశాబ్దాల క్రితం వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. వారికి సాగర్ జలాశయంలో లభించే సహజ సిద్ధమైన తాజా చేపలు పట్టడమే ఉపాధి. నాటినుంచి నేటి వరకు ప్రతీ మత్స్యకారుల కుటుంబంలో మగవారు జలాశయంలో రాత్రివేళల్లో వలలు వేసి చేపలు వేటాడుతుంటారు. ఉదయం వలలను తీసి అందులో చిక్కుకున్న చేపలను ఇంటికి తెస్తారు. అలా వేటాడిన చేపలను మత్స్యకార మహిళలు రోడ్ల వెంట ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న గుడిసెల్లో చేపల ఫ్రై, చేప పచ్చళ్లు పెట్టి సాగర్‌కు వచ్చే పర్యాటకులకు విక్రయిస్తుంటారు. ఈ చేపల ఫ్రై పర్యాటకుల కళ్ల ముందే చేపలను శుభ్రపరిచి కట్‌చేసి తాజాగా తయారు చేసిన మసాలాలు పట్టించి నూనెలో వేయిస్తారు. ఈ వేడి వేడి ఫ్రై తినే కొద్దీ తినాలనిపించేలా రుచివంతంగా ఉంటుంది. అంతేకాకుండా సాగర్ జలాశయంలో వేటాడిన చేపలను కొంతమంది మత్స్యకారులు ముంబయి, కోల్‌కతాకు ఎగుమతి కూడా చేస్తున్నారు. సాగర్ మత్స్యకారులకు చేపల వేట ఉపాధిగా మారింది. తమ కుటుంబ పోషణకు చేపల వేటే ఆధారమని పలువురు మత్స్యకారులు పేర్కొంటున్నారు.

వారాంతాల్లో పర్యాటకుల రద్దీ



నాగార్జునసాగర్‌కు వారాంతాల్లో రెండు తెలుగు రాష్ట్రాలనుంచే కాక దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఆ రోజుల్లో చేపలకు గిరాకీ బాగుంటుంది. చేపల ఫ్రై, కూర వండటానికి ఎండు మిరపకాయల్లో పసుపు, లవంగాలు, ధనియాల పొడివేసి ప్రత్యేకంగా మసాల కారం పొడిని తయారు చేస్తాం. అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను కూడా ప్రత్యేకంగా తయారు చేస్తాం. అందుకే మేము చేసే చేపల ఫ్రై రుచి ఏ స్టార్ హోటల్‌లో కూడా ఉండదు.

కోటమ్మ, మత్స్యకార మహిళ, హిల్‌కాలనీ

చేపల వేటే మా జీవనోపాధి



డ్యాం నిర్మాణంలో పనిచేయడానికి వైజాక్ నుంచి మా తాతలు కూలీకోసం సాగర్‌కు వచ్చారు. డ్యాం నిర్మాణం పూర్తయిన తర్వాత చేపల వేటే మా జీవనోపాధిగా మారింది. సాగర్‌కు వరదలు వచ్చే సమయంలో చేపలు పడవు. అప్పుడు మా కుటుంబం గడవడం కష్టంగా ఉంటుంది.

అప్పారావు, మత్స్యకారుడు, ఫైలాన్ కాలనీ

మత్స్యకారులను ఆదుకోవాలి



సాగర్‌లో మా మత్స్యకార కుటుంబాలు 500 వరకు ఉన్నాయి. అందరి జీవనోపాధి సాగర్ జలాశయంలో చేపలు వేటాడమే అయ్యింది. కానీ ఒక్కోసారి చేపలు పడకపోవడంతో వ్యాపారం జరగక కుటుంబం గడవడం ఇబ్బందిఅవుతుంది. మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

రమణ, సాగర్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, సాగర్

చలికి వెచ్చదనం



భువనగిరిలో ఏర్పాటు చేసిన స్వెటర్ల దుకాణం, కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

చలి పెరగడంతో ఉన్ని దుస్తుల కొనుగోలుపై ప్రజలు అసక్తి చూపుతున్నారు. వాతావరణంలో జరుగుతున్న మార్పులు, ఈదురగాలులతో క్రమేపి చలి తీవ్రత పెరుగుతోంది. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ప్రజలు ఉదయం, రాత్రి సమయాల్లో ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి. దుకాణాలు, ఫుట్‌పాత్‌లలో మహిళలు, వృద్ధులు స్వెట్టర్లు, దుప్పట్లు, రగ్గులు విక్రయిస్తున్నారు.

స్టాఫ్ ఫొటో గ్రాఫర్ (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



నల్లగొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్‌భట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు ఎంపికైంది. పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని తిరుమల అంకిత ప్రతిభ కనబరిచి ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెలలో వికారాబాద్ జిల్లా పరిగిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అంకిత ఆడనున్నట్లు తెలిపారు. విద్యార్థినీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.మారయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మల్లీశ్వరీ, ఉపాధ్యాయులు అభినందిచారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు అమ్మనబోలు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

నల్లగొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి హాకీ సెలెక్షన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో రేణుశ్రీ, ప్రేమ్. అండర్-17 విభాగంలో కె.దుర్గ, జె.నిహారిక పోటీలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు జే.శేఖర్ రెడ్డి, పీడీ నూస్రత్ సుల్తానా, ఉపాధ్యాయులు సీహెచ్ ప్రకాష్, ఏ.శ్రీనివాస్, వై.విజయ్ కుమార్ తెలిపారు.

వైభవంగా కార్తీక ఏకాదశి పూజలు







పుష్పార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు, సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు, మినీ శిల్పారామంలో నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు బహుమతి ప్రదానం చేసిన నిర్వాహకులు

● స్వామికి లక్ష పుష్పార్చన ● నిత్యాదాయం రూ. 54.94లక్షలు

యాదగిరిగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో శనివారం కార్తీక మాసంలో ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కార్తీకంలో ఏకాదశి కలిసిరావడంతో హరుహరుల దర్శనం, సత్యదేవుని వ్రతాలు, కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధానాలయ ముఖమండపంలో పాంచరాత్రాగమనరీతిలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వైజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామా పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన గంటపాటు పూజాపర్వం నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్యపూజలు

స్వామివారి క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. సుదర్శనహోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. స్వామివారిని సుమారు 50వేల మంది భక్తులు దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా రూ.54,94,232 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

శిల్పరామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

భువనగిరి గంజ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పరిధిలోని రాయిగిరి మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సిద్దేంద్రయోగి శిష్య బృందం ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శనివారం నల్లగొండ నుంచి వచ్చిన పాలబిందెల బాలు కూచిపూడి నాట్య శిష్య బృందం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదిగో అల్లదిగో, మహాగణపతిమ్, పలుకే బంగారమాయె తదితర పాటలకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈఈ సంపత్‌కుమార్, శిల్పారామం మేనేజర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తుల మన్ననలు పొందేలా కార్యాచరణ

- చెర్వుగట్టు ఆలయ నిర్వహణ వ్యవహారాలపై ఈవో దృష్టి
- పాలనా సంస్కరణలు కొత్త పద్ధతులకు శ్రీకారం



నార్కట్‌పల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రంగా బాసిల్లుతున్న నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో పాలనా సంస్కరణలకు నూతన ఈవో సల్వాది మోహన్‌బాబు శ్రీకారం చుట్టారు. దేవస్థానం సిబ్బందిలో విధుల పట్ల బాధ్యత, అంకిత భావం మరింత పెంచే విధంగా మార్పునకు కార్యాచరణ రూపొందించారు.

డ్రెస్ కోడ్..

దేవస్థానంలో విధులు నిర్వహించే ఉద్యోగు లు, సిబ్బంది తప్పనిసరిగా (ఫుల్ వైట్) డ్రెస్ కోడ్‌పాటించాలని ఆదేశించారు. డ్రెస్ కోడ్‌లో భాగంగా ఉద్యోగి లేదా సిబ్బంది హోదా స్థితిని తెలియజేసే గుర్తింపుకార్డును కూడా విధుల్లో ఉన్నంతసేపు మెడలో ధరించాలని సూచించారు. తద్వారా క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులకు ఆలయ సిబ్బంది ఎవరో డ్రెస్‌కోడ్ ద్వారా సులువుగా గుర్తించగలరని పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ సిబ్బందికి వేరే రంగులో డ్రెస్ కోడ్‌ను పెట్టారు.

జీపీఎస్‌తో ఫొటో అప్‌లోడ్..

ఆలయ సిబ్బంది హాజరుకు సాంకేతికతను జోడించారు. గతంలో బయోమెట్రిక్ థంబ్ వేయడం ద్వారా హాజరు నమోదుతో పాటు రిజిస్టర్‌లో సంతకం చేసే విధానం ఉంది. వీటిని యథావిధిగా పాటిస్తూనే దేవస్థానంలో విధుల పరంగా కేటాయించిన (జీపీఎస్ లొకేషన్) ప్రదేశాల్లోకి వెళ్లి ఫొటో దిగి ఆలయ వాట్సాప్ గ్రూప్ లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. తాను పనిచేస్తున్న వేములకొండ, పాలకుర్తి, ఆందోళ్ మైసమ్మ దేవాలయంలో కొనసాగుతున్న ఈ హాజరు విధానాన్ని ఇక్కడా అమలు చేస్తున్నారు. అంతేకాక ఆలయ సిబ్బంది పనివేళలను కూ డా కొద్దిగా మార్పు చేశారు. ఆలయాన్ని శుభ్రపరిచే స్వీపర్లు వారం క్రితం వరకు ఉదయం 6 గంటలకు విధులకు హాజరయ్యేవారు. కానీ అప్పటికే భక్తులు ఆలయానికి వస్తున్న కారణంగా భక్తులు వచ్చే సరికి స్వీపర్లు విధులకు హాజరై ఆలయాల పరిసరాలను శుభ్రపరిచేలా పనివేళలను ఉదయం 6 గంటలకు బదులు తెల్లవారుజామున 5గంటలకు మార్పు చేశారు.

ఆలయ శుద్ధి

గతంలో నిత్యం స్వీపర్లతో ఆలయాల పరిసరాలను ఎంతగా శుభ్రపరిచినా భక్తులకు చెప్పేవారు లేక చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేసేవా రు. దీంతో గుట్టపై ఆలయ పరిసరాల్లో దుర్వాసన, దుర్గంధం వెదజల్లేది. ప్రతీ గురువారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి తనతో పాటు సిబ్బంది అందరూ శ్రమదానం చేసేలా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతీ గురువారం ఆలయ పరిసరాలను శుభ్రం చేయడం నీటితో ఆలయాలు, మండపాలు, ఇతర ప్రదేశాలను శుద్ధి చేయాలని నిర్ణయించారు.

నిత్యనైవేద్య ప్రసాదం

దర్శనం అనంతరం నిష్క్రమించే భక్తులకు ప్రతీ రోజూ నిత్య నైవేద్య ప్రసాదాన్ని పెట్టడం ప్రారంభించారు. శ్రీశైలం, విజయవాడ ఇతర క్షేత్రాల్లో ఇప్పటికే కొనసాగుతున్న ఈ విధానాన్ని (గతంలో ఇక్కడ కూడా కొన్ని రోజులు నిర్వహించారు) కొనసాగించాలని నిర్ణయించారు. రోజుకు కనీసం 2 కేజీలు లేదా 5 కేజీల పరిణామంలో ఉచిత నైవేద్య ప్రసాదాన్ని భక్తులకు పెట్టాలని సంకల్పించి కొనసాగిస్తున్నారు.

సెలవు సంతకంతో ముడి

ఏ సిబ్బంది లేదా ఉద్యోగి అయినా సెలవు కోరితే అతని స్థానంలో సేవలు కొనసాగేలా సె లవుల మంజూరులో కొత్త పద్ధతి విధించారు. సెలవులో వెళ్లే ఉద్యోగి లేదా సిబ్బంది పనిచేసే విభాగంలో సహ సిబ్బందితో సెలవు చీటీపై సం తకం పెట్టించాలనే పద్ధతిని ప్రవేశపెట్టారు. త ద్వారా సెలవులో వెళ్లిన ఉద్యోగి భక్తులకు అందాల్సిన సేవల్లో లోటు ఉండకూడదనే ఉద్దేశ్యంగా చెబుతున్నారు. ఆలయంలో చేపడుతున్న మార్పులను కొనసాగించి మెరుగైన సేవలను అందించాలని భక్తులు కోరుతున్నారు.

శబరిమలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు



నల్లగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రకు బయలుదేరిన భక్తుల సౌకర్యం కోసం రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి సూపర్ లగ్జరీ బస్సులను న డుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సులు బుకింగ్ చేసుకున్న వారికి అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. గురుస్వామికి ఉచిత ప్రయాణంతో పాటు గురుస్వామి బ స్సు బుక్ చేసిన సందర్భంలో ఒకటి కంటే ఎ క్కువ బస్సులు బుక్ చేస్తే ఏటీడీ ఏజెంట్‌లకు చెల్లించిన మాదిరిగా బస్సుకు రూ.300 కమీషన్ చెల్లిస్తామన్నారు. అదేవిధంగా ఇద్ద రు వంట మనుషులకు 10 సంవత్సరాల కం టే తక్కువ వయస్సు ఉన్న ఇద్దరు మణికంఠలకు ఒక లగేజీ అంటెండెంట్‌కు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

రామగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్చక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు కోరారు. ఆధ్వర్యంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్‌కి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు శశిధర్ ఉన్నారు.

పంటను పారదర్శకంగా కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటను ప్రభుత్వం పారదర్శకంగా కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం, పత్తి పంటను రైతులు అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డారమని అన్నారు. రైతులు ధాన్యాన్ని అమ్ముకున్న తర్వాత ట్రక్ షీట్ ఇవ్వకుండా మిల్లుకుపోయిన తర్వాత ధాన్యం బాగలేదని మిల్లుల యాజమాన్యం ఇష్టానుసారంగా కటింగ్ చేసి ట్రక్ షీట్ ఇవ్వడం సరైంది కాదన్నారు. పత్తి రైతులు మిల్లులకు పత్తి తీసుకుపోయి రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నా బయ్యర్లు పత్తిని కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళారుల వద్ద ముడుపులు తీసుకుని తీసుకువచ్చిన పత్తిని కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నో ప్రలోభాలకు గురిచేసి ఓటర్లను బెదిరింపులకు పాల్పడి గెలిచారని, నైతికంగా బీఆర్ఎస్ పార్టే గెలిచిందని అన్నారు. గత ఎన్నికల్లో 70వేల ఓట్లకు పైగా బీఆర్ఎస్ పార్టీకి వచ్చాయన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ మాజీ ఛైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కొప్పుల ప్రదీప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ తలారి బలరాం, పార్టీ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మునిసిపల్ కౌన్సిలర్ పల్లె విజయ్, నాయకులు గొర్ల వీరయ్య, రాచకొండ వెంకన్న, మాద నగేష్, గుర్రం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ విజయంపై హర్షం



చిట్యాలలో స్వీట్లు పంచుతున్న బీజేపీ నాయకులు

చిట్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఎన్డీ కూటమి 200కు పైగా సీట్లు సాధించడం పట్ల చిట్యాలలోని బీజేపీ నాయకులు హర్షం ప్రకటించారు. శనివారం ప్రజలతో కలిసి స్వీట్లు పంచుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని దేశం మొత్తం ఆదరిస్తుందనీ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, కన్నెబోయిన మహలింగం, బొడిగె అశోక్, పల్లె వెంకన్న, కంచర్ల శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

కనగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేలకంటిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఇందిరమ్మ ఇళ్ల మండల కమిటీ సభ్యుడు బోగరి రాంబాబు లబ్ధిదారులకు జీపీ కార్యాలయంలో ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో పైలట్ ప్రాజెక్ట్ కింద గ్రామానికి మొదటి విడతలో 107 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం మరో 12 మందికి ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందుకున్న లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో బిళ్లపాటి మోహన్‌రెడ్డి, కార్యదర్శి క్రాంతి నాయకులు బైరు నగేష్, ప్రభుదాసు, మదు తదితరులున్నారు.

నిబంధనలు సడలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడురామకృష్ణ

మర్రిగూడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోలు పై కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధనల సడలించి రైతులకు న్యాయం చేయాలని రైతుబంధు సమన్వయ కమిటీ మాజీ సభ్యుడు బచ్చు రామకృష్ణ డిమాండ్‌చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎకరాకు 7 క్వింటాళ్ల వరకే రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలని సీసీఐ కేంద్రాలకు ఆదేశించడంపట్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఎకరాకు 7 క్వింటాల దిగుబడి నిబంధనలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీసీఐ కేంద్రాల ద్వారా రైతుల నుంచి పత్తి కొనుగోలు విషయంలో ఎలాంటి ఆంక్షలు షరతులు నిబంధనలు పెట్టకుండా పత్తి విక్రయాలు చేసుకోవటానికి రైతులకు అండగా నిలిచి న్యాయం చేసిందని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయాలు చేయాలంటే కపాస్ కిసాన్ యాప్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలనడం బాధాకరంగా ఉందని, గ్రామీణ ప్రాంతంలో ఆన్‌లైన్ స్లాట్ బుక్ ఎలా చేసుకోవాలో తెలియక రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఇప్పటికే రైతులు అకాల వర్షాల వల్ల చేతికొచ్చిన పత్తి పంట తడిసి ముద్దై రైతులకు నష్టం వాటిలిందని, పత్తి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పత్తి విక్రయాల విషయంలో షరతులు పెట్టడం బాధాకరంగా ఉందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులతో సమగ్ర సర్వే చేయించి రైతులను ఆదుకోవాలని కోరారు. పత్తి విక్రయాలలో ఆంక్షలు నిబంధనలను సడలించి ఎకరాకు 15 క్వింటాల చొప్పున రైతుల నుండి సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర సీనియర్ నాయకులు రామిడి వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటరాం, గంట రవి, చెరుకు శ్రీరాములు, మనోహర్, యాదగిరి ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడి



మర్రిగూడలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునుగోడు రూరల్/మర్రిగూడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడితో పాటు అధిక ఆదాయం పొందవచ్చనని ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక దిగుబడితో పాటు అధిక ఆదాయం పొందవచ్చునని పతంజలి మార్కెట్ మేనేజర్ ప్రసాద్ అన్నారు. శనివారం మునుగోడు మండలంలోని కొంపల్లి రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎకరానికి 57 మొక్కలను నాటుకోవచ్చని, పత్తి వరి పంటల కంటే అధిక లాభాలు పొందవచ్చునని తెలిపారు. మార్కెట్ సమస్య కూడా లేదు ప్రభుత్వ ఆధ్వర్యంలో బై బ్యాక్ అగ్రిమెంట్ కూడా ఉంటుందని తెలిపారు. ఆయిల్ పామ్ ద్వారా ఇప్పటికే వేసిన రైతులు చెప్పిన ప్రకారం ఎకరానికి సుమారు 1 లక్ష నుంచి 1.50లక్షల వరకు నికర ఆదాయం వస్తోందని తెలిపారు. పీఏసీఎస్ మానిటరింగ్ ఆఫీసర్ టి.రేణుక, సీఈవో పాలకూరి సుఖేందర్‌గౌడ్, అశోక్‌రెడ్డి, డైరెక్టర్ ఎం.యాదయ్య, మండల వ్యవసాయ అధికారి ఎస్.పద్మజ, వ్యవసాయ విస్తరణ అధికారి పాలకూరి యాదగిరి గౌడ్, ఆలయ కమిటీ ఛైర్మన్ వెదిరే విజయేందర్ రెడ్డి, పామ్ ఆయిల్ ఫీల్డ్ అసిస్టెంట్ పి. స్వామి రైతులు మక్కెన అప్పారావు పాల్గొన్నారు.

● ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారిస్తే అధిక దిగుబడులతో ఆదాయం వస్తుందని మునుగోడు డివిజన్ ఉద్యాన శాఖ అధికారి రావుల విద్యాసాగర్ అన్నారు. శనివారం మర్రిగూడ మండలంలోని శివన్నగూడ రైతు వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఆయిల్‌పామ్ సాగుపై శివన్నగూడ, లెంకలపల్లి, సరంపేట, కుదాభక్షపల్లి, వెంకిపల్లి, వెంకిపల్లి తండా, చర్లగూడెం, రాంరెడ్డిపల్లి, కొట్టాల, మేటి చందాపురం గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో సీఈవో మధు, మర్రిగూడ ఏవో సహస్, పతంజలి ప్లాంటేషన్ ఆఫీసర్ భానుచందర్, పతాంజలి ప్లాంటేషన్ ఫీల్డ్ ఆఫీసర్ కలకొండ యాదయ్య, సొసైటీ వైస్ ఛైర్మన్ రంగినేని యాదగిరి రావు, సొసైటీ డైరెక్టర్లు రవీందర్ రెడ్డి, ఉత్తరయ్య, రాములు, రవి నాయక్, వెంకటయ్య, చంద్రయ్య పలు రైతులు ఉన్నారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు

మర్రిగూడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు దళారుల చేత మోసపోకుండా సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయాల కోసం ప్రభుత్వం కపాస్ కిసాన్ యాప్ అమలు చేసిందని, దాని సద్వినియోగం చేసుకోవాలని మునుగోడు సహాయ వ్యవసాయ సంచాలకుడడు బి.వేణుగోపాల్ అన్నారు. శనివారం మండలంలోని కమ్మగూడం, మర్రిగూడ, తమ్మడపల్లి, ఎర్రగొండపల్లి గ్రామాలలో కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ పైన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పత్తి విక్రయాల కోసం ప్రభుత్వం రైతుల కోసం ఈ యాప్‌ను అమలు చేసిందని ప్రతి ఒక్క రైతు యాప్ పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రైతులు ఈనెల 17వ తేదీ నుండి స్లాట్ బుక్ చేసుకొని పత్తి అమ్మకాలు చేసుకోవచ్చు అన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత మండల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి సమస్యలను తెలుసుకోవాలని వారు సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాహస్ర, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు విజయ్, నాగ స్వాతి, రాధిక, శ్రీలత, సుజాత, వీరితోపాటు రైతులు ఉన్నారు.

చండూరు రూరల్: మండల పరిదిలోని బంగారిగడ్డ గ్రామంలో రైతులకు కపాస్ కిసాన్ యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో చంద్రిక మాట్లాడుతూ రైతులంతా స్లాట్ బుక్‌చేసుకుని మార్కెట్‌కు వెళ్లాలని సూచిం చారు. రైతులు తమ పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నా స్లాట్ బుక్ కాకపోతే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద తమ మొబైల్ నంబర్‌ను అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలి



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నేతలు

చిట్యాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజన సంస్కృతి పరిరక్షణకు అందరూ పాటుపడాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి కొంపెల్లి సూర్య కోరారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ్‌దివాస్‌లో భాగంగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూ లమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాల గూర్చి ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు వంగూరి గణేష్, యశ్వంత్, ఫణీంద్ర, కావ్య, నవ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కనగల్, నవంబరు 15: (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వసంతాల ముగింపు వేడుకల్లో భాగంగా డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో జరిగే బహిరంగ సభ పోస్టర్‌ను శనివారం కనగల్‌లో ఆపార్టీ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దోటి పాండారి, జోగు సురేందర్, బోగరి రాంకోటి, పిచ్చయ్య తదితరులున్నారు.

శిశు విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ యాదమ్మ

చండూరురూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలను విక్రయించడం చట్టరీత్యా నేరమని, దీనికి కఠినచర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. మండల పరిధిలోని శనివారం పుల్లెంల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన భేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో శిశువిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అది చట్టవిరుద్ధమని అన్నారు. పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలు, శిశు విక్రయాలు, భ్రూణహత్యలు, మిషన్‌వాత్సల్యపై వారికి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో ఎ ప్పటికప్పుడు రెండు, మూడవ సంతానంలో ఆడపిల్లలు జన్మించిన ఇళ్లను సందర్శించి వారికి తగు సూచనలు చేయాలని సూచించారు. ముఖ్యంగా బాలికలపై జరుగుతు న్న అత్యాచారాలపై అవగాహన కల్పించారు. గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థు లకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీపీఎస్ రాము, హెచ్ఎం సరస్వతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మమ్మ, ధనలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇస్లాంనగర్‌లో రేషన్‌దుకాణం ప్రారంభం

కనగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని ఇస్లాంనగర్‌కు నూతనంగా మం జూరైన రేషన్ దుకాణాన్ని శనివారం తహసీల్దార్ పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్‌షాపు కోసం ఎ న్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రామస్థులకు ప్రభుత్వం రేషన్‌దుకాణాన్ని కేటాయించి వారి కలను సాకారం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి సహకారంతో అర్హులైన పేద కుటుంబాలకు తెల్ల రేషన్‌కార్డులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు రాజారెడ్డి, మాజీ జడ్పీటీసీ చిట్ల వెంకన్న మాజీ సర్పంచ్ చిలకరాజు వెంకన్న, బిక్షంయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'చేతిలో చెయ్యేసి' కథా సంకలనం ఆవిష్కరణ

చిట్యాలరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతిలో చెయ్యేసి కథా సంకలనం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 16వ ఆవిష్కరిస్తున్నట్లు సృజన సాహితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగర్ల సత్తయ్య తెలిపారు. ఈ కార్యక్రమం నల్లగొండలోని యూటీఎఫ్ భవన్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హ్యామ్ రోడ్లు ఖరారు

(5వ పేజీ తరువాయి)

పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించారు. వీటిలో ప్రస్తుతం ఉన్న సింగిల్ లేన్‌ను బలోపేతం చేయడం, సింగిల్ నుంచి డబుల్ లేన్‌కు మార్చడం, డబుల్‌లేన్ల రోడ్లను నాలుగు వరుసల రహదారులుగా అభివృద్ధి చేయడం, డబుల్ లేన్లను అభివృద్ధి చేయడంతోపాటు బ్రిడ్జిల నిర్మాణాల పనులను చేర్చారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 60 రోడ్లకు 1,026.05 కిలోమీటర్ల రోడ్లు ఈ పథకం కింద చేర్చారు. ఈ పనులన్నింటికీ త్వరలో టెండర్లను ఆహ్వానించనుండడంతో పాటు వచ్చే మూడేళ్లలో పనులన్నీ పూర్తిచేయాలని నిర్ణయించారు.

చండూరుకు నిధుల వరద

- మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు
- త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం



చండూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మునిసిపాలిటీలకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. కొత్త మునిసిపాలిటీలు, గ్రామాలు విలీనమైన మునిసిపాలిటీల్లో పనులకు ప్రాధాన్య మివ్వాలని సూచించింది. రాష్ట్రంలోని 138మునిసిపాలిటీలకు రూ.2,780 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలంగాణ కోర్ అర్బన్ సిటీని మినహాయించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మునిసిపాలిటీల్లో అభివృద్ధి పనులకు వెంటనే నిధులు విడుదల అయ్యాయి. తెలంగాణ రైజింగ్ విజన్ 2027లో భాగంగా పట్టణాలను గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది.

2018లో ఏర్పాటైన మునిసిపాలిటీ

మేజర్ గ్రామపంచాయితీ ఉన్న చండూరును 2018 సంవత్సరంలో మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్‌గా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మునిసిపాలిటీ పరిధిలోని 10వార్డులు ఉండగా, చండూరు, లకినేనిగూడెం, అంగడిపేట గ్రామాలు ఉన్నాయి. సుమారు 20వేలు జనాభా కలిగి ఉంది. రాష్ట్రంలో మునిసిపాలిటీలన్నింటిలో చండూరు అతి చిన్నది. దీంతో మునిసిపాలిటీ అభివృద్ధికి సరిపడా నిధులు లేకపోవడంతో అభివృద్ధిలో వెనకబాటు గు రైంది. ఇటీవల ప్రభు త్వం రూ. 15కోట్లు అభివృద్ధి నిధులు మంజూరు చేసింది.

రూ.15 కోట్లతో పనులు

చండూరు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న చండూరు పట్టణానికి రూ. 5కోట్లు, లకినేనిగూడెం రూ.3 కోట్లు, అంగడిపేట రూ.7కోట్లు చొప్పున ప లు అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, కమ్యూనిటీ హాల్స్, మినీ పార్కులు, విద్యుత్ సమస్యల పరిష్కారాలకు ఈ నిధులతో పనులు చేపట్టనున్నారు. ఈ నిధులతో ఏఏ పనులు చేయాలో ఇప్పటికే ప్రభుత్వానికి మునిసిపల్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అనుమతులు రాగానే టెండర్ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు పనులు మొదలు పెడతామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఒకటి, రెండు నెలల్లో అభివృద్ధి పనులు మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మునిసిపాలిటీలో ఉన్న ప్రధాన సమస్యలన్నీ తీరనున్నాయి.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



చండూరు మునిసిపల్ పరిధిలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి వివరించగానే, వెంటనే స్పందించి నిధులు మం జూరు చేయించారు. వారికి మేము రుణపడి ఉంటాం. ప్రతిపాదనలకు అనుమతులు రాగానే టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించాలని కోరాం. ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి కానుంది.

\- దోటి సుజాతవెంకటేష్‌యాదవ్,
మునిసిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్, చండూరు

టెండర్ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం



చండూరు కొత్త మునిసిపాలిటీ కావడం, ఇందులో గ్రామాలు మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలకు, పట్టణాల అభివృద్ధికి ప్రభు త్వం రూ.15కోట్లు మంజూరు చేసింది. పట్టణంలో ఇప్పటికే వివిధ రకాలైన 54 పనులను గుర్తించాం. ఉన్నతాధికారుల నుంచి ప్రతిపాదనలకు అనుమతులు రాగానే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం. ఈ నిధులతో పట్టణం శరవేగంగా మరింత అభివృద్ధి కానుంది.

\- ఎస్. మల్లేశం, మునిసిపల్ కమిషనర్

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.80 (304.4680)	14,274	14,274
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.15 (4.36)	1,642.81	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.260

హ్యామ్ రోడ్లు ఖరారు



- రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలోనే అత్యధికం
- 11,399.33కోట్లలో 21శాతం నిధులు ఉమ్మడి జిల్లాకే
- ఆర్‌అండ్‌బీ ప్రాజెక్టులో అగ్రతాంబూలం
- 1,026కి.మీ రూ.2346.96కోట్ల ప్రతిపాదనలు

కీలకమైన గ్రామీణ రోడ్ల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెస్తున్న హ్యామ్ (హైబ్రిడ్ యాన్యువల్ మోడల్) విధానంలో ఉమ్మడి జిల్లా రోడ్లకు అగ్రతాంబూలం దక్కింది. ఈ రోడ్ల పునరుద్ధరణ, విస్తరణ ప్రాజెక్టును ఆర్‌అండ్‌బీశాఖ చేపట్టడం, ఉమ్మడి జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ శాఖకు మంత్రి కావడంతో ఈ ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో ఉమ్మడి జిల్లా రోడ్లకే సుమారు 21శాతం నిధులు దక్కాయి.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

శాశ్వత ప్రాతిపదికన రోడ్లను నిర్మించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టులో రోడ్ల నిర్మాణమేగాక జాతీయరహదారుల తరహాలో నిర్మాణంతో పాటు 15 ఏళ్లపాటు నిర్వహణ సైతం చూసేలా జాతీయవిధానానికి మార్పులు, చేర్పులు చేస్తూ హ్యామ్ (హైబ్రిడ్ యాన్యువల్ మోడల్)ను అమల్లోకి తెస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్లను బలోపేతం చేయడం, అవసరమైన చోట్ల డబుల్‌లేన్లు, ఫోర్‌లేన్లుగా మార్చడం, బ్రిడ్జిల నిర్మాణాలు సైతం చేపట్టడం వంటి పనులకు ఈ ప్రాజెక్టులో చోటుదక్కింది. ఆర్‌అండ్‌బీశాఖ పనుల ఖరారుతోపాటు, ప్యాకేజీలను నిర్ణయించి టెండర్లకు వెళ్లేందుకు ప్రణాళికను క్యాబినెట్ ఆమోదంతో ఇప్పటికే సిద్ధం చేసింది. ఈ ప్యాకేజీలకు త్వరలో టెండర్లను ఆహ్వానించనుండడంతో మరో మూడేళ్ల కాలవ్యవధిలో జిల్లాలో ఈ పథకం కింద చేపట్టిన రోడ్లన్నీ అందుబాటులోకి రానున్నాయి. 15 ఏళ్లపాటు నిర్వహణ సైతం నిర్మాణ సంస్థలే భరించనుండడంతో గుంతల బెడద, మరమ్మతుల ఇబ్బందులు దీర్ఘకాలంపాటు తప్పుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఉమ్మడి జిల్లాకే 21శాతం నిధులు

హ్యామ్ ప్రాజెక్టులో ఆర్‌అండ్‌బీశాఖ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.11,399.33కోట్ల అంచనావ్యయాన్ని ప్రాథమికంగా నిర్ధారించగా, అందులో ఉమ్మడి జిల్లాలో చేపట్టే పనులకు రూ.2,346.96కోట్ల నిధులు కేటాయించనున్నారు. సుమారు 21శాతం నిధులు జిల్లా రోడ్ల నిర్మాణాలకు దక్కనున్నాయి. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 32 ప్యాకేజీలను ఖరారు చేస్తే అందులో ఉమ్మడి జిల్లా పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం కింద 5,824కి.మీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనుండగా, అందులో 18శాతం అంటే 1,026 కి.మీ నల్లగొండ జిల్లా రోడ్లకు వాటా దక్కింది. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా 419 రోడ్లను ఈ ప్రాజెక్టులో చేర్చితే అందులో 60 రోడ్లు ఉమ్మడి జిల్లాకు దక్కాయి.

ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో కీలక పనులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన...

- మిగతా 8వ పేజీలో...

నల్లగొండ జిల్లాలో హ్యామ్ రోడ్లు ఇవే..

డిండి-దేవరకొండ	34కి.మీ	రూ.108.87కోట్లు
కొండమల్లేపల్లి-దర్వేశిపురం (మూడు పనులు)	43 కి.మీ	రూ.133.40కోట్లు
డిండి-దేవరకొండ-కంబాలపల్లి	31కి.మీ	రూ. 84.87కోట్లు
ముకుందాపురం-అడవిదేవులపల్లి (రెండుపనులు)	30కి.మీ	రూ.80.50కోట్లు
మిర్యాలగూడ-తడకమళ్ల	15.43కి.మీ	రూ.50.12 కోట్లు
కుక్కడం-పాములపహాడ్	20కి.మీ	రూ.17.56కోట్లు
బొత్తలపాలెం-రాగడప	25.65కి.మీ	రూ.22.52కోట్లు
గూడాపూర్-చౌటుప్పల్	42.80కి.మీ	రూ.133.12కోట్లు
ఇడికూడ-నారాయణపూరం	19.20కి.మీ	రూ.52.74కోట్లు
అల్వాలఅడ్డరోడ్డు-రాజవరం	14.22కి.మీ	రూ.39.06కోట్లు
నకిరేకల్-మూసీరోడ్డు	12.00కి.మీ	రూ.11.52కోట్లు
మెడికల్‌కాలేజీ-ఏ.దుప్పలపల్లి	10కి.మీ	రూ.210.03కోట్లు
నకిరేకల్-గురజాల	17.60కి.మీ	రూ.19.54కోట్లు
కురుమూర్తి-శాలిగౌరారం	10.20కి.మీ	రూ.8.95కోట్లు
నల్లగొండ-చౌటుప్పల్	15కి.మీ	రూ.48.03కోట్లు
సూర్యాపేట జిల్లాలో...		
దురాజ్‌పల్లి-గరిడేపల్లి	27.20కి.మీ	రూ.31.50కోట్లు
సూర్యాపేట-నెమ్మికల్-దంతాలపల్లి	36.40కి.మీ	రూ.42.15కోట్లు
మామిడాల-కుంటపల్లి	18.40కి.మీ	రూ.16.15కోట్లు
రాయినిగూడెం-బరాఖత్‌గూడెం	11.20కి.మీ	రూ.12.97కోట్లు
కోదాడ-రేవూరు రోడ్డు	20.05కి.మీ	రూ.24.07కోట్లు
శాంతినగర్-గొండ్రియాల	11.60కి.మీ	రూ.10.18కోట్లు
హుజూర్‌నగర్-మేళ్లచెరువు	11.10కి.మీ	రూ.12.85కోట్లు
హుజూర్‌నగర్-యాతవాకిళ్ల	4.00కి.మీ	రూ.4.63కోట్లు
హుజూర్‌నగర్ లింకురోడ్-రింగ్‌రోడ్డు	6.15కి.మీ	రూ.7.13కోట్లు
బరాఖత్‌గూడెం-కాగితరాంచంద్రాపురం	7.00కి.మీ	రూ.8.11కోట్లు
యాదాద్రి జిల్లాలో...		
నాగిరెడ్డిపల్లి-టేకులసోమారం-వలిగొండ-తుమ్మలగూడెం-బోగారం-రామన్నపేట- చిట్యాల	14.20కి.మీ	రూ.85.11కోట్లు
భువనగిరి-చిట్యాల రోడ్డు	25.80కి.మీ	రూ.154.64కోట్లు
తుర్కపల్లి-రంగాపూర్	17.80కి.మీ	రూ.20.61కోట్లు
ఆలేరురోడ్డు-జగదేవ్‌పూర్ రోడ్డు	28.20కి.మీ	రూ.60.78కోట్లు
ఆలేరు-జీడికల్	12.50కి.మీ	రూ.16.86కోట్లు
జీడికల్-అమ్మనబోలు	26.00కి.మీ	రూ.34.88కోట్లు
రాయిగిరి-మోత్కూరు రోడ్డు నుంచి చిట్యాల-భువనగిరి రోడ్డు వరకు	15.50కి.మీ	రూ.13.61కోట్లు
చౌటుప్పల్-నాగారం	18.50కి.మీ	రూ.21.43కోట్లు



అంగన్‌వాడీల సేవలు అంతంత మాత్రమే

- ఉమ్మడి జిల్లాలో పలు టీచర్, ఆయా పోస్టులు ఖాళీ
- టీచర్ ఉంటే ఆయా లేరు.. ఆయా ఉంటే టీచర్ లేరు
- ఒక్కొక్కరికీ రెండు, మూడు కేంద్రాల నిర్వహణ బాధ్యత

మోత్కూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో పాటు, ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుచేశాయి. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ వయసు పరిమితి 65 ఏళ్లు. టీచర్లు, ఆయాలు ఉద్యోగ విరమణ పొందుతుండగా, వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో చాలా కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.కొన్ని చోట్ల ఒక్కొక్కరికి రెండు, మూడు కేంద్రాల బాధ్యత అప్పగించారు. వారు ఒక కేంద్రంలో ఉంటే మరో కేంద్రం మూసివేయాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వాల లక్ష్యం నీరుగారుతుండగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు.

ఉమ్మడి జిల్లాలో 4,203 అంగన్‌వాడీ కేంద్రాలు

యాదాద్రి జిల్లాలో 901 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటి పరిధిలో 36,084 మంది చిన్నారులు, 5,024 మంది గర్భిణులు, 4,392 మంది బాలింతలు నమోదై ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 2,093 అంగన్‌వాడీ కేంద్రాలు...

- మిగతా 7వ పేజీలో...



గుమ్మడితో లాభాలెన్నో..!

7

లోక్‌అదాలత్ 12 బెంచీల ఏర్పాటు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సంపూర్ణ ఆనంద్



పెండ్లిపాకల రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

నల్లగొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల సౌకర్యం కోసం లోక్‌అదాలత్ 12 బెంచీలు ఏర్పాటు చేశామని జిల్లా ఇన్‌చార్జి న్యాయాధికారి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సంపూర్ణ ఆనంద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని లోక్‌అదాలత్‌లలో 31 సివిల్ కేసులు, 2,813 క్రిమినల్ కేసులు, 45 మోటార్ ప్రమాద బీమా కేసులు, 6 చెక్‌బౌన్స్ కేసులను, 26 సైబర్ క్రైం కేసులు మొత్తంగా 2,921 కేసులను పరిష్కరించామన్నారు. ప్రమాద బీమా కేసుల్లో రూ.2,95,35,000 పరిహారంగా ఇప్పించామని, సైబర్ క్రైం కేసుల్లో రికవరీ డబ్బు రూ.2,17,915ను ఇప్పించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తంరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అనంతరెడ్డి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండాను స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్

దేవరకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఆదివాసీ బిర్సా ముండా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ బంజరా భవన్‌లో నిర్వహించిన బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చత్రునాయక్ మాట్లాడుతూ, గిరిజన హక్కులు, భూముల కోసం బ్రిటీష్ పరిపాలనలో పోరాటం నిర్వహించిన బిర్సా ముండా ఆదర్శనీయుడన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సహాయ సంక్షేమాధికారి శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో డానియేల్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, గిరిజన సంఘం నేతలు లక్ష్మణ్ నాయక్, గరం సింగ్, గోపాల్ సింగ్, పాపనాయక్, రమావత్ దులిషానాయక్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి కృష్ణవేణి

చిట్యాలరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా శిశు, మహిళా సంక్షేమాధికారి కృష్ణవేణి అన్నారు. శనివారం మండల పరిధిలోని గుండ్రాంపల్లి, వనిపాకల, పెద్దకాపర్తి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నవయసులో వివాహాలతో పలు అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. లైంగిక వేధింపులపై 1098, 100, 1908, 181 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సీడీపీవో లావణ్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిపాకల పనుల పనురుద్ధరణకు చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(చెరువు) కింద దెబ్బతిన్న పనులన్నింటినీ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఆమె పరిశీలించారు. 1వ పీయర్ నుంచి 5వ వరకు వర్షాలకు తెగిన కాల్వలు, దెబ్బతిన్న రహదారి, కట్ట పరిస్థితిని పరిశీలించారు. భారీ వర్షాలతో రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండి ప్రమాద స్థాయికి చేరుకోగా, రిజర్వాయర్ వెంట ఉన్న రెండు తండాలు హీర్యతండా, సింగ్యాతండా, ప్రజలను ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించామన్నారు. రిజర్వాయర్ పరిధిలో దెబ్బతిన్న పనుల పునరుద్ధరణకు ఎఫ్‌డీఆర్ కింద ప్రతిపాదనలు పంపామన్నారు. హీర్యతండా, సింగ్యతండా, గుడితండా, కారోబార్‌తండాలు, రిజర్వాయర్ స్థిరీకరణ, సామర్థ్యం, ఎత్తు పెంచితే మునకకు గురయ్యే విస్తీర్ణం, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 251.5 ఎఫ్‌ఆర్‌ఎల్ ఉండగా, నిల్వ సామర్థ్యాన్ని పెంచితే తండాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వాయర్ ఎత్తు పెంచి నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు రూ.1,204కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అందులో భాగంగా 2,771 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, ఇప్పటి వరకు 1,917 ఎకరాలు సేకరించారు. 854 ఎకరాలకు అవార్డు పాస్ అవ్వగా, చెల్లింపులు చేయాల్సి ఉంది. ఈ రిజర్వాయర్ పూర్తయితే గ్రావిటీ ద్వారా జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం కలుగుతుంది. ఇదిలా ఉండగా, కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ భద్రు, ఈఈ నెహ్రూనాయక్, డీఈ రాములు, ఏఈఈ భాస్కర్ రావు, శ్రావణ్, సతీష్ తదితరులు ఉన్నారు.



పెండ్లిపాకల రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ పూర్తిచేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ కలెక్టరేట్): నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నెలాఖరు నాటికి పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో ప్రకారం నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. అందుకు లబ్ధిదారుల జాబితా రూపొందించాలని, ఈ నెల 21న లాటరీ ద్వారా ఎంపిక చేయాలని, ఎంపికైన లబ్ధిదారులకు 22న ప్రొసీడింగ్స్ సిద్ధం చేయాలన్నారు. వాటిని శాసనసభ్యులు, ప్రజాప్రతినిధుల ద్వారా పంపిణీ చేయించాలన్నారు. లాటరీ ద్వారా ఎంపిక విధానాన్ని వీడియోగ్రఫీ చేయించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవోలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించేందుకే 'ప్రజాబాట'

ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

నల్లగొండ టౌన్, చిట్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా 'ప్రజాబాట' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రత్నా ఫంక్షన్ హాల్‌లో 'ప్రజాబాట'పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు చిట్యాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిర్వహణను పరిశీలించారు. 'ప్రజాబాట'లో వారంలో మూడు రోజులు ఉదయం 8 నుంచి 1 గంటల వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. పెద్ద పనులకు అవసరమైతే ప్రతిపాదనలు పంపించాలని, వెంటనే బడ్జెట్ విడుదల చేస్తామన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించాలన్నారు. వచ్చే వేసవి యాక్షన్ ప్లాన్ అమలుకు ఇప్పటికే రూ.20కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. విద్యుత్ బకాలు వసూలు చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ అన్నయ్య, ఏడీఈ బాలునాయక్, ఏఈ రవీందర్, సిబ్బంది దామనూరి ఈశ్వర్, మెండె శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

ఎంజీయూ వీసీతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భేటీ



ఎంజీయూ వీసీతో భేటీ అయిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

నల్లగొండ టౌన్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ఎంజీ యూనివర్శిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శనవారం వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లగా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వీసీ ఎమ్మెల్సీని శాలువాతో సన్మానించారు. అనంతరం హాల్‌లో ఎమ్మెల్సీ విద్యార్థులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సూదగాని హరిశంకర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి వట్టె జానయ్య యదవ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నర్సయ్యగౌడ్, కార్యదర్శి కొమ్మల ప్రవీణ్ రాజ్, రాష్ట్ర నాయకులు నాగరాజు గౌడ్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, లింగం, పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాడుదాం

ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మురళి

నల్లగొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాడుతామని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి అన్నారు. శనివారం టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడి, పెండింగ్ సమస్యలు పరిష్కరించడంలో టీఎన్‌జీవోస్ సంఘం ముందంజలో ఉంటుందన్నారు. 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. సరెండర్ లీవ్స్, మెడికల్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలపై పరిష్కారం కోసం 22 నెలలుగా ఎదురుచూస్తున్నామన్నారు. దీనిపై పలుమార్లు సీఎం, డిప్యూటీ సీఎం, ఉపసంఘానికి విన్నవించినా ఇంకా పెండింగ్‌లోనే ఉంచడం శోచనీయమన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులకు ప్రతీ నెల రూ.700కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కార్డులు మంజూరు చేయాలన్నారు. కమిటీలతో కాలయాపన చేయడం సరికాదన్నారు. పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతంతో ఫిట్‌మెంట్‌ను అమలు చేయాలన్నారు. 317జీవో బాధితులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాలకు అనుగుణముగా క్యాడర్ స్ట్రెంత్ పెంచాలన్నారు. అనంతరం సభ్యత్వనమోదును ప్రారంభించారు. సమావేశంలో టీఎన్జీవోస్ నాయకులు నరసింహచారి, వంగూరి విజయకృష్ణ, ఏ.లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, గంగపుత్ర సైదులు, మధుసూదనాచారి, బి.రణదీవే, మధు, సిహెచ్.రాజశేఖర్, ప్రవీణ్, నారాయణస్వామి పాల్గొన్నారు.



సభ్యత్వాలు అందజేస్తున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు మురళి

వైద్యుల నిర్లక్ష్యం అని తేలితే చర్యలు



చిన్నారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో 17 మంది చిన్నారులకు అస్వస్థత విషయంలో వైద్యుల నిర్లక్ష్యం తేలితే చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆసుపత్రికి వచ్చి చిన్నారులను పరామర్శించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. డ్యూటీలో ఉన్న నర్సు, డాక్టర్‌తో మాట్లాడి విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు ఇచ్చిన ఇంజక్షన్‌ను పరీక్షల కోసం డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించామన్నారు. ఈ ఘటనపై కమిటీ వేశామని, రెండు రోజుల్లో కమిటీ నివేదికలు వస్తాయన్నారు. ఆ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డీసీహెచ్‌వో డాక్టర్ మాతృనాయక్, సీఎంవో డాక్టర్ భానుప్రసాద్‌నాయక్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

- విద్యుత్‌శాఖలో 'ప్రజాబాట'
- క్షేత్రస్థాయి సమస్యలపై ప్రత్యేక దృష్టి
- వారానికి మూడురోజులు కేటాయింపు
- డివిజన్ పరిధిలో సత్ఫలితాలిస్తున్న కార్యక్రమం

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కరెంటు సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు కార్యాలయాల చుట్టూ ప్రదిక్షణలు చేసే రోజులకు స్వస్తిపలికేందుకు రాష్ట్ర విద్యుత్‌శాఖ ప్రతిష్ఠాత్మక చర్యలు చేపట్టింది. క్షేత్రస్థాయిలో ఏర్పడ్డ సాంకేతిక, ఇతరత్రా సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించే ఉద్ధేశంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో అధికార యంత్రాంగం తమ సేవలను ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు ప్రతీ వారంలో మూడురోజులు ప్రజాబాట పడుతున్నారు. విద్యుత్‌శాఖ మంత్రి ఆదేశాల మేరకు గత నెలాఖరులో కార్యరూపం దాల్చిన ఈ కార్యక్రమాన్ని క్రమేపీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృతం చేశారు. ప్రతీ వారం మంగళ, గురు, శనివారం రోజుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించుకున్నారు. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో పని చేసే లైన్‌మన్ మొదలుకొని సీఈ స్థాయి వరకు అధికార యంత్రాంగమంతా ఆయా రోజుల్లో అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు అధికారులు ప్రజాబాటకు ప్రాధాన్యతనిస్తున్నారు. స్థానికంగా నెలకొన్న సూక్ష్మ విద్యుత్ సమస్యలతో పాటు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా మిగిలిన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సాధ్యమైనంత మేరకు సత్వరమే పరిష్కరిస్తున్నారు. ప్రధానంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డంగా పెరిగిన చెట్టుకొమ్మల నరికివేత, లూజ్‌లైన్ మరమ్మతులు, కండక్టర్ తీగల ఏర్పాటు, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు, వ్యవసాయ క్షేత్రాల్లో ప్రమాదకరంగా ఉన్న హైటెన్షల్(హెచ్‌టీ), లో టెన్షన్(ఎల్‌టీ) లైన్ల మరమ్మతులు, 33/11 కేవీ, 220కేవీ సబ్‌స్టేషన్ల పరిశీలన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. డివిజన్ పరిధిలోని 54 సబ్‌స్టేషన్ల పరిధిలో 123 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల కింద 2,62,631 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అందుల్లో 73,361 వ్యవసాయ, 1347 పారిశ్రామిక, 1,60,719 గృహవిద్యుత్, 27,204 ఇతర విద్యుత్ కనెక్షన్లు విద్యుత్ సరఫరా జరుగుతోంది.


వినియోగదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

ఇప్పటి వరకు డివిజన్‌లోని రెండు మునిసిపాలిటీలు, 10 మండలాల పరిధిలో సుమారు 450 విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు 280 చోట్ల శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రైస్‌మిల్లు పాయింట్ల వద్దకు రైతులు ధాన్యాన్ని నేరుగా తరలించి విక్రయించుకుంటున్న నేపథ్యంలో ధాన్యం పరిశ్రమలను సాఫీ గా నడిపించేందుకు వీలుగా విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా రబీ సీజన్‌లో పంటల సాగుకు రైతాంగం సమాయత్తమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ విద్యుత్ సరఫరాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, గృహ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతూనే ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా పల్లెలు, పట్టణాల్లో పర్యటించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారులు తొలి ప్రాధాన్యమిస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా టీఎస్‌పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యుత్‌శాఖ మంత్రి ఆదేశాల మేరకు గత నెల నుంచి ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అధికారులంతా గ్రామాలు, పట్టణాల్లో సంచరించి ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించడంతో పాటు, అత్యవసర సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అధికారులు, ప్రజలమధ్య సత్సంబంధాలు మెరుగు పడి అ ధికారుల సేవలు విస్తరిస్తున్నాయి. అధికారులు నిజాయ తీ, నిష్పక్షపాతంగా పనిచేయాలని ఆదేశిస్తున్నాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే ఫ్యూజ్ ఆఫ్ కాల్ 9493951288 నెంబర్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలి.

- ఎం. శ్రీనివాసచారి డీఈ, మిర్యాలగూడ

భవిష్యత్తు ప్రణాళిక రూపకల్పన

ప్రజాబాట కార్యక్రమంలో బాగంగా అధికారులు పల్లెలతో పాటు మునిసిపాలిటీల్లోనూ పర్యటిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ అవసరతను గుర్తించడం, లోవోల్టేజీ సమస్య పరిష్కరించేందుకు శాఖాపరమైన చర్యలు చేపడుతున్నారు. ప్రజా అవసరాలను గుర్తించి భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తున్నారు. విద్యుత్ సరఫరాను విస్తృతం చేసేందుకు అవసరమైన అంచనా వ్యయంతో కూడిన నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రజాబాట కార్యక్రమానికి ప్రత్యేక నిధి కేటాయించిన నేపథ్యంలో అధికారులు నివేదించిన అంచనా వ్యయాన్ని పరిశీలించి ప్రధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమేగాక ప్రమాద రహిత విద్యుత్ వియోగానికి పెద్దపీట వేస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు నిరంతరాయంగా కొనసాగిస్తామని అధికారులు చెబుతున్నారు.

లోక్ అదాలత్‌లో 664 కేసులు పరిష్కారం

నిడమనూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మున్సిఫ్ కోర్టులో శనివారం నిర్వహించిన ప్రత్యేక జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో కక్షిదారులు 664 కేసులు పరిష్కారం చేసుకున్నారు. ఇందులో 308 పీటీ కేసులు, 218 డ్రంకెన్ డ్రైవ్ కేసులు కాగా కక్షిదారులు రాజీపడటంతో పాటు జరిమానా విధించిన 138 కేసులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి స్వప్న, కోర్టు సూపరింటెండెంట్ శర్మ, పీపీ సాధన, న్యాయవాదులు ఉన్నం చినవీరయ్య, వెంకన్ననాయక్, నాగరాజు, వినోద్, సతీష్. పవన్, రవికుమార్, జార్జి, జయమ్మ, ఆయా పోలీస్‌స్టేషన్ల కోర్టు పీసీలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కొండమల్లేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేఎంపీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొత్తబావి గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు బ్యాగులు, కంపాక్స్ బాక్స్, పెన్సిల్ బాక్సులు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు కూన భానుచందర్, ఏరుకొండ రాము, జిఙ తేందర్‌యాదవ్, సైదులు, రవికుమార్, సైదులు, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

గొడకొండ్లలో సామూహిక సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

చింతపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని గొడకొండ్ల వేణుగోపాల స్వామి ఆలయంలో కార్తీకమాసంలో ఏకాదశిని పురస్కరించుకొని శనివారం భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సత్యభామ రుక్మిణీ సమేత గోపాలస్వామి మూలమూర్తులకు పంచామృతాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. దీంతో ఆలయంలో సత్యనారాయణ స్వామి నామస్మరణతో మార్మోగింది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అ ల్వాల జంగయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మద్దెల కృష్ణగౌడ్, లలిత, ధర్మకర్తలు ఇడుకుళ్ల రాంమోహన్, గ్యార ఉమా యాదయ్య, కడారి జంగయ్య, సురిగి వెంకటయ్య, భక్తులు తమ్మగోని శంకర్, ముడిగ మల్లేష్, హరీష్, శివ పాల్గొన్నారు.


పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి


కంప్యూటర్లను అందజేస్తున్న ఏకే, విద్యేధన్ ఫౌండేషన్ సభ్యులు

హాలియా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తామని ఏకే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని అనుముల మండల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఏకే ఫౌండేషన్, విద్యేధన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాబంధు కార్యక్రమంలో భాగంగా అచెరాన్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో శనివారం విద్యార్థులందరికీ డిజిటల్ క్లాసెస్ ఉపయోగార్థం 15 కంప్యూటర్ మానిటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రతీ రంగం కంప్యూటర్‌తో ముడిపడి ఉందని అన్నారు. విద్యార్థులు కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించుకొని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యేధన్ ఫౌండేషన్ సెక్రటరీ బుర్ల సరిత మాట్లాడుతూ బాలికలకి సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు మెండుగా ఉన్నాయని, గోల్ ఓరియాంటెడ్‌గా చదివితే భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కుకుడాల హైమావతి, ఫౌండేషన్ సభ్యులు ఆశీష్, వాగ్దేవి, తనిష్కా, మన్నెం కోటి, రావుల రాముయాదవ్, శేఖర్‌గౌడ్, గంగుల అంజి, బొమ్మిశెట్టి రామలిగయ్య, పులి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రంగయ్య

- ఉత్తర్వులు జారీచేసిన అధికారులు


డాక్టర్ రంగయ్య

మిర్యాలగూడఅర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రంగయ్యను నియమిస్తూ జిల్లా వైద్యాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చే శారు. ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ సమరధ్‌ను సూపరింటెండెంట్ విధుల నుంచి తప్పించారు. కొద్ది రోజులుగా విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. అదేవిధంగా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్లంతా సక్రమంగా విధులు నిర్వహించేలా పర్యవేక్షణ కొనసాగించడం లేద న్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ మహిళ ఆయాసంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చి సకాలంలో వైద్యం అందక మృతి చెందిన సంఘటనపై కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్యాధికారులు విచారించారు. తమ విచారణలో ప్రస్తుత సూపరింటెండెంట్ నిర్లక్ష్య వైఖరి బయటపడగా, కొందరు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్న విషయం అధికారుల దృష్టికి వెళ్లింది. దీనంతటికి సూపరింటెండెంట్ నిర్లక్ష్యమే కారణంగా భావిస్తూ అతనిపై వేటువేశారు. దీంతో శ్రీనివాస్ సమరధ్‌ను విధుల నుంచి తప్పిస్తూ నూతన సూపరింటెండెంట్‌గా ఏరియా ఆస్పత్రిలో ఎండీ, జనరల్ మెడిసిన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రంగయ్యకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్ బాధ్యలు నిర్వహించిన శ్రీనివాస్ సమరధ్ ఈఎన్‌టీ విభాగానికి పరిమితం చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జడ్పీ సీఈవో శ్రీనివాసరావు


రావులపెంట జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీనివాసరావు

వేములపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మోనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జడ్పీ సీఈవో శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో రావులపెంట జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజన విషయంలో అలసత్వం వహించరాదని, పరిశుభ్రమైన వాతావరణంలో స్వచ్ఛమైన నీటితో నాణ్యమైన కూరగాయలు వినియోగించి భోజనం తయారు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం లేనిచో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే ప్రత్యేక కార్యాచరణతో సాధన చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, ఎంఈవో లక్ష్మణ్ నాయక్, పంచాయతీ కార్యదర్శి రాంరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్


కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలోని ఆయన నివాసంలో శనివారం గుడిపల్లి మండలం చిలుకమర్రి గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డితో పాటు మరికొందరు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరినట్లు ఆయన ప్రకటించి పార్టీ కండువా కప్పి మాట్లాడారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రజా సమస్యలను విస్మరించిందన్నారు. నిరుద్యోగులు, రైతులు విద్యార్థులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలను పక్కకు పెట్టి తరుచుగా ఢిల్లీ చుట్టూ తిరగడం సరిపోతుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లు, రైతు బంధు, పించన్, మిషన్‌భగీరథ నీరు, లాంటి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి చేసినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మునగాల అంజిరెడ్డి, వల్లపు రెడ్డి, నరసింహ, పరమేష్, రాజశేఖర్, కృష్ణారెడ్డి, దామోదర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ప్రజా సంఘాల జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య


బిర్సా ముండ చిత్రపటానికి నివాళుర్పిస్తున్న ప్రజా సంఘాల, ఎమ్మార్పీఎస్ నాయకులు

దేవరకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఆదివాసీ గిరిజన నేత బిర్సా ముండ ఆశయ సాధన కోసం కృషి చేయాలని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య అన్నారు. దేవరకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం గిరిజన సంఘాల, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బిర్సా ముండ జ యంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు ఘ నంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ బిర్సా ముండ చిన్న వయస్సులోనే గిరిజనుల, ఆదివాసుల హ క్కుల సాధన కోసం ఉద్యమించి అమరడయ్యారని ఆయన గుర్తు చే శారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రజా సంఘాల నేతలు బి.సైదులు, ఎనయ్య, కిషన్‌లాల్ అంకూరి శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

హాలియా, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీలోని శ్రీశ్లోక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా శాన్విక, కలెక్టర్‌గా శ్రీజ, జాయింట్ కలెక్టర్‌గా లాస్య, డీఈవోగా అశ్విత్, ఎంఈవోగా అక్షిత్, ప్రధానోపాధ్యాయుడిగా గ్రేసీ, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కుకుడాల ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు ఒక్కరోజు చేసిన పాలనను వారు నిజ జీవితంలో ఇలాంటి గొప్ప స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు జీవితంలో తమ కలను నిజం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గుజ్జరి నవీన్‌కుమార్, కుడుదాల నరేష్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం


అవగాహన సమావేశంలో మాట్లాడుతూ ఏడీఏ చరిత

గుర్రంపోడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని హాలియా డివిజన్‌ఏడీఏ చరిత అన్నారు. మండలంలోని కొప్పోలు రైతు వేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రిప్ పరికరాలకు ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, బీసీ రైతులకు 90శాతం, ఓసీ రైతులకు 80శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌యాదవరెడ్డి, పతంజలి అధికారి ప్రకాష్, శివకుమార్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

నందిపాడు బైపాస్ పనులు ప్రారంభం


నందిపాడు ఫ్లైఓవర్ పనులను ప్రారంభించిన టెక్నికల్ అధికారులు

మిర్యాలగూడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి - అద్దంకి రహదారిపై మిర్యాలగూడ నందిపాడు జంక్షన్ వద్ద నిర్మించ తలపెట్టిన ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యాయి. శనివారం టెక్నికల్ అధికారులు రోడ్డు వైడింగ్ పనులను పరిశీలించారు. రెండుకు రెండు వైపులా 200 మీటర్ల వెడల్పున కొలతలు వేసి ముగ్గు పోశారు. గత ఏడాది సెప్టెంబరు 18వ తేదీన మిర్యాలగూడ 4 జంక్షన్ల వద్ద రూ.147 కోట్లతో నిర్మించనున్న ఫ్లైఓవర్లకు రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భూమిపూజ చేశారు. కాగా వై జంక్షన్ వద్ద మట్టి నమూనాలు పరిశీలించిన అనంతరం టెక్నికల్ సమస్యల కారణంగా వాయిదా వేశారు. ముందుగా నందిపాడు జంక్షన్ వద్ద నిర్మించాలనే ఆలోచనతో టెక్నికల్ అధికారులు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు రోడ్డు మార్కింగ్ పనులు పరిశీలించి రోడ్డుకు ఎడమ పక్కన ఏడు కోట్ల తండాకు తాగునీరు సరఫరా చేసే మునిసిపల్ పైపులైన్లు, కుడి పక్కన ఉన్న బంగారుగడ్డకు మంచినీరు సరఫరా చేసే పైపులైను, మూడు లిఫ్టింగ్ లైన్లు, రెండు డిశ్చార్జికి సంబంధిన లైన్లు వెళ్తున్నందున వాటిని మార్చాల్సి ఉందని, అందుకు అనుగుణంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం


కలశ పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

నిడమనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం పుష్కర (12వ) వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ప్రాతకాల సేవ, గణపతి పూజ, పూర్ణావాచనం, ఆలయ తోరణం, కలశ స్థాపన, మూలయంత్ర హోమం, శతఘటాభిషేకం వంటి కార్యక్రమాలను ప్రధాన అర్చకుడు ప్రతాపురం వెంకటాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేసి, సాయంత్రం గ్రామోత్సవ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆలయంలో మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మలిసేని రమణాచార్యులు, గురుస్వాములు పేలపూడి శ్రీనివాసరావు, జూపల్లి నాగరాజు, కోమటి వెంకన్న, ఉన్నం ఈశ్వర్, కొండోజు కృష్ణాచారి, ఉషాకిరణ్, తిమ్మిశెట్టి మహేష్, భీమేశ్వరరావు, పీరయ్య, మధు, మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

పత్తి రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలి

గుర్రంపోడు నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పత్తిని సీసీఐ కేంద్రంలో అమ్ముకోవటానికి రైతులు సమీపంలో ఉన్న రైతు వేదికలను సంప్రదించి ఏఈవోల సాయంతో కిసాన్‌కపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని హాలియా డివిజన్ ఏడీఏ ఎం.చరిత కోరారు. మండలంలోని గుర్రంపోడు, కొప్పోలు రైతు వేదికలను శనివారం ఆమె సందర్శించారు. రైతు స్లాట్ బుక్ చేసుకుంటే పత్తి విక్రయం సులభమవుతుందని అన్నారు. హాలియా డివిజన్‌లో రైతులకు రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కపాస్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో మాదవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, ఏఈవోలు దివ్య, గౌతమ్, జితేందర్, జోత్స్న, శిరీష తదితరులు పాల్గొన్నారు.

హాలియా: పత్తి పండించిన రైతులు కేంద్ర ప్ర భుత్వం ప్రవేశపెట్టిన కిసాన్‌యాప్‌లో తప్పనిసరిగా స్లాట్ బుక్ చేసుకోవాలని డివిజన్ ఏడీఏ సరిత, ఏవో వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కూడా గ్రామాల్లో వ్యవసాయశాఖ ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్లాట్‌బుక్ చేసుకొని రైతులు గ్రామాల్లో ఏఈవోల ద్వారా వారి ఆధార్ నెంబర్‌తో స్లాట్ బుక్ చేసుకొని పత్తిని మద్దతు ధరకు విక్రయించుకోవాలని తెలియజేశారు.

హ్యామ్ రోడ్లు ఖరారు

(5వ పేజీ తరువాయి)

పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించారు. వీటిలో ప్రస్తుతం ఉన్న సింగిల్ లేన్‌ను బలోపేతం చేయడం, సింగిల్ నుంచి డబుల్ లేన్‌కు మార్చడం, డబుల్ లేన్ల రోడ్లను నాలుగు వరుసల రహదారులుగా అభివృద్ధి చేయడం, డబుల్ లేన్లను అభివృద్ధి చేయడంతోపాటు బ్రిడ్జిల నిర్మాణాల పనులను చేర్చారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 60 రోడ్లకు 1,026.05 కిలోమీటర్ల రోడ్లు ఈ పథకం కింద చేర్చారు. ఈ పనులన్నింటికీ త్వరలో టెండర్లను ఆహ్వానించనుండడంతో పాటు వచ్చే మూడేళ్లలో పనులన్నీ పూర్తిచేయాలని నిర్ణయించారు.